J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74
నెల్లూరు, 10.04.2020, శుక్రవారం సంపుటి : 39 సంచిక : 45 పేజీలు : 12, వెల : ₹ 5

# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి www.lawyerteluguweekly.com




## కరోనా సమరానికి లాక్‌డౌన్...

# పొడిగింపుతోనే ముగింపు!



వీడియో కాన్ఫరెన్స్‌లో విపక్షాలతో మాట్లాడుతున్న భారత ప్రధాని నరేంద్ర మోడీ

- అన్ని రాష్ట్రాల సీఎంల సంఘీభావం
- మరికొన్ని రోజులు స్వీయనిర్బంధమే
- ప్రజల నుండి అపూర్వ స్పందన
- కరోనాను తరిమే వరకు ఎత్తిన చైతన్య కత్తి దించేది లేదు
- రాజకీయాలకతీతంగా ఏకతాటిపై నిలిచిన భారతావని

***యు**ద్ధభూమిలో బలమైన శత్రువుతో పోరాడుతున్నాం... రోజుల తరబడి యుద్ధం సాగుతోంది... శక్తినంతా కూడదీసుకుని శత్రువుని చీల్చి చెండాడుతున్నాం... మన పోరాటం ధాటికి శత్రువు ఒక్క అడుగు వెనక్కి తగ్గాడనుకుందాం... అక్కడితో శత్రువుతో యుద్ధం ముగిసిందని, మనం విజయం సాధించామనుకుంటే పప్పులో కాలేసినట్లే! శత్రువు మనల్ని చూసి భయపడిపోయాడనుకుని కత్తి దించేసి విశ్రాంతి తీసుకుంటే... కాచుక్కూచున్న శత్రువు మళ్లీ మనపై దాడి చేయొచ్చు. నిద్రమత్తులో వున్న మనపై దాడి చేసి పూర్తిగా అంతమొందించవచ్చు. కాబట్టి శత్రువును తుదముట్టించే దాకా అలుపెరుగని పోరు చేస్తేనే గెలుపు తీరాలకు చేరగలం.*

కరోనా వైరస్ అనే శత్రువుపై ఇప్పుడు భారతదేశం చేస్తున్న యుద్ధం కూడా అలాంటిదే! లాక్‌డౌన్ అనే బ్రహ్మాస్త్రం ద్వారా భారత ప్రధాని నరేంద్ర మోడీ కరోనాపై యుద్ధం ప్రకటించాడు. పూర్వకాలంలో ప్రపంచాన్ని జయించాలనుకుని వచ్చిన అలెగ్జాండర్‌ను నిలువరించింది, ఓడించింది భారతదేశమే! ఇప్పుడు కూడా ప్రపంచాన్ని కబలించడానికి వచ్చిన కరోనా వైరస్‌ను కంట్రోల్‌లో పెట్టింది కూడా భారతదేశమే! ఇంతవరకు మందు లేని ఈ వైరస్‌కు లాక్‌డౌన్ దివ్యౌషధంగా మారింది. భారత ప్రధాని నరేంద్ర మోడీ ఎంతో ముందుచూపుతో విధించిన లాక్‌డౌన్ మూలంగా భారత్‌పై కరోనా దాడి తీవ్రత తగ్గిందనే చెప్పుకోవాలి. అన్ని రంగాలలోనూ ఎంతో అభివృద్ధి చెందిన అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, ఇటలీ, స్పెయిన్, స్విట్జర్లాండ్, జర్మనీ (మిగతా 11వ పేజీలో)

## మాటల కంటే...

# చేతలు ఘనం!



### కరోనాపై పోరులో స్ఫూర్తిదాయక పనితీరు

***రో**జుకు రెండుసార్లు ప్రెస్‌మీట్లు పెట్టడం.. నాలుగుసార్లు వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహించడం, ఓ పదిమంది అధికారులను సస్పెండ్ చేయడం.... ఆకస్మిక తనిఖీలు చేసి అధికారులను వారి పనులు వారు చేసుకోకుండా తన వెంట తిప్పుకోవడం... సమర్ధవంతుడైన సీఎం అనిపించుకోవడానికి ఇవే ప్రధాన అర్హతలు అయితే ఖచ్చితంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి అసమర్ధుడే! ఈ విషయంలో చంద్రబాబే ఫస్ట్‌ర్యాంక్ అనుకోవచ్చు.*

అలా కాకుండా సమస్య పరిష్కరించడానికి సీఎం రోజుకు నాలుగుసార్లు ప్రెస్‌మీట్లు పెట్టుకోనవసరం లేదు, వీడియో కాన్ఫరెన్స్‌లు పెట్టి (మిగతా 11వ పేజీలో)

## అంతటా..

# భయం.. భయం!

జిల్లా వ్యాప్తంగా.. 49 కేసులు

> కరోనా కలవరపెడుతోంది > నిర్మానుష్యంగా వీధులు > స్వీయనిర్బంధంలోకి ప్రజలు

**నెల్లూరుజిల్లా వాసులను నక్సలిజం భయపెట్టలేదు... ఫ్యాక్షనిజం భయపెట్టలేదు... కాని కరోనా వైరస్ భయపెడుతోంది. చాపక్రింద నీరులా విస్తరిస్తున్న వైరస్ నగరవాసులనే కాదు, గ్రామీణ ప్రాంతాల ప్రజలను సైతం ఆందోళనకు గురిచేస్తోంది.**

లాక్‌డౌన్ ప్రకటించే నాటికి నెల్లూరు జిల్లాలో ఒకటే ఒక పాజిటివ్ కేసు వుండింది. అది కూడా ఇటలీ రిటర్న్. ఆ అబ్బాయి మూలంగా జిల్లాలో ఇంకెవరికీ వైరస్ సోకలేదు. నిజాముద్దీన్ మర్కత్‌తో జిల్లా అంతా కంపు అయ్యింది. ఈ నెల 9వతేదీ ఉదయానికి జిల్లాలో 49 పాజిటివ్ కేసులు నమోదైవున్నాయి. ఒక్క నెల్లూరు నగరంలోనే 17 కేసులు తేలాయి. నెల్లూరు తర్వాత నాయుడుపేట పెద్ద డేంజర్‌జోన్‌గా మారింది. ఈ పట్టణంలో 11 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. నెల్లూరు నగరంతో పోలిస్తే నాయుడుపేటలో 11 కేసులు చాలా ఎక్కువ. నెల్లూరు కంటే (మిగతా 11వ పేజీలో)





# ఆరోగ్యాన్ని ప్రసాదించే.. శీతల యాగం

## - వెంకటగిరిలో పోలేరమ్మ అమ్మవారికి అరుదైన పూజలు



జిల్లాలోని వెంకటగిరిలో పోలేరమ్మ తల్లికి చేసే పూజలు ఎంతో అరుదైనవి. పూర్వంలో వెంకటగిరి రాజాలు నూరేళ్ళకు ఒకసారి వ్యాధులు సంక్రమిస్తూనే ఉన్నాయని, కలరా వంటి వంటి ప్రాణాంతకమైన వ్యాధులను నివారించి ప్రజలను రక్షించేందుకు అప్పట్లో 'శీతలయాగం' నిర్వహించేవారు. 1917లో వెంకటగిరి రాజాలు ఎంతో శక్తివంతమైన ఈ



యాగాన్ని నిర్వహించి కలరా వ్యాధిని పారద్రోలారని వెంకటగిరి ప్రజలు నేటికీ చెప్తున్నారు. ఆ తర్వాత ఇన్నేళ్ళకి మళ్ళీ కరోనా నేపథ్యంలో వెంకటగిరి పోలేరమ్మ అమ్మవారికి ఈ అరుదైన.. విశిష్టమైన శీతలయాగాన్ని నిర్వహించడం విశేషం.

### మహిమాన్వితం శీతలదేవి యాగం

**- వేదపండితుడు రమేష్‌శర్మ**

వెంకటగిరిలో ఎంతోకాలంగా పోలేరమ్మతల్లిగా పూజలను నిర్వహిస్తున్న శిలపై ఎంతో మహిమాన్వితమైన బీజాక్షరాలు ఉన్నాయని, ఆ అక్షరాలే శీతలదేవి యంత్రమని, ఆ తల్లికి పూజలు చేస్తే ఎలాంటి వ్యాధులు కూడా దరిచేరవని, గత కాలంలో ఒకసారి వెంకటగిరిలో కలరా వ్యాధి వచ్చినప్పుడు ఈ శీతలయాగం నిర్వహించి ఆ వ్యాధితో ప్రజలు బాధలు పడకుండా వెంకటగిరి రాజాలు ఎంతో భక్తిశ్రద్ధలతో పూజలు చేశారని, వారి పూజలు ఫలించి ప్రజలు సురక్షితంగా ఉన్నారని ప్రముఖ వేదపండితుడు, కుర్తాళం పీఠం అస్థాన పండితుడు రమేష్ శర్మ చెప్పారు. ఆరోగ్యాన్ని ప్రసాదించే ప్రధానమైన దైవం శీతలదేవి అని ఆయన అంటూ, ప్రాణాంతకమైన వ్యాధులు ఒకరి నుంచి మరొకరికి సంక్రమించకుండా ఉండాలంటే ఒకవ్యక్తికి మరోవ్యక్తికి మధ్య దూరాన్ని తప్పనిసరిగా పాటించాలని శీతలదేవి అమ్మవారు చెప్పినట్లు పురాణాల్లో ఉందని ఆయన వివరించారు. కరోనా మహమ్మారి నేపథ్యంలో ఇప్పుడు కూడా ప్రజలు భౌతికదూరం పాటించడం శ్రేయస్కరమన్నారు. ప్రజలంతా తమ ఇళ్ళ వద్ద గుమ్మాలకు వేపమండలు కట్టి గ్రామ శక్తి పోలేరమ్మతల్లి ప్రతిమను నట్టింట్లో పెట్టి భక్తితో పూజలు చేయాలని సూచించారు. చాలా కాలం తర్వాత మళ్ళీ ఇప్పుడు ఈ శక్తివంతమైన పూజలు నిర్వహించామని ఆయన అన్నారు. ఈనెల 6న పోలేరమ్మ అమ్మవారి సన్నిధిలో మహా సంకల్పం, గణపతి పూజ, పుణ్యాహవచనం, మాతృకాపూజ, దీక్షాగ్రహణం, పంచగవ్య సంస్కారం, అఖండ దీపాస్థానం నిర్వహించి ఈ యాగానికి అంకురార్పణ చేశామని, రక్షాబంధనం, కలశస్థాపనం, మండపారాధనలు, శీతల మంత్ర జప పారాయణాలు చేపట్టి అమ్మవారికి మహా మంగళహారతి సమర్పించామని ఆయన తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా విజృంభిస్తున్న కరోనా మహమ్మారి ప్రజలను పట్టి పీడించకుండా పోలేరమ్మ అమ్మవారికి ప్రీతిపాత్రమైన మంగళవారం నాడు ఈనెల 7న శీతలదేవి యంత్రానికి నిష్టతో పూజలు చేశామని, కలశపూజలు, మండపపూజల అనంతరం శీతలదేవి అమ్మవారికి విశేష అభిషేకాలు, ప్రత్యేక హోమాలు నిర్వహించామని ఆయన చెప్పారు. అమ్మవారికి ఎంతో ఇష్టమైన అంబలిని నైవేద్యంగా సమర్పించి, ఆ తర్వాత ఆ ప్రసాదాన్ని ప్రజలకు పంచడం జరిగిందన్నారు. వెంకటగిరి ప్రాంతంలో కలరా వ్యాధి రాకుండా పూర్వకాలంలో వెంకటగిరి రాజాలు శీతలయాగం నిర్వహించారని, ఈ యాగం ఎంతో పవిత్రమైందని, మహిమాన్వితమైందని టిటిడి చీఫ్ లైజనింగ్ ఆఫీసర్ వెంకటశర్మ కూడా తెలిపారు. శీతలదేవిని పూజిస్తే ఎలాంటి వ్యాధులు రావనే నమ్మకం పూర్వకాలం నుంచి ఇప్పటికీ వెంకటగిరి ప్రజల్లో ఉందన్నారు. అందుకే ప్రజలంతా ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్ధిస్తూ ఈ పూజలు చేయడం ఎంతో శుభ పరిణామమని ఆయన పేర్కొన్నారు.

ఆలయ కార్యనిర్వహణాధికారి ఏ.వి. శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ మహమ్మారుల నుంచి, విపత్తుల నుంచి కాపాడే గ్రామశక్తి వెంకటగిరి పోలేరమ్మతల్లి అని ఆయన చెప్పారు. వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి సూచనలతో ఇన్నేళ్ళ తర్వాత మళ్లీ వెంకటగిరిలో పోలేరమ్మ తల్లి ఆలయం వద్ద శీతలయాగం నిర్వహించడం జరిగిందని, మూడురోజుల పాటు ఈ యాగం ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించామని, కరోనా మహమ్మారి వైరస్ ప్రజలెవరికీ సోకకుండా ఉండేందుకు చేసిన ఈ విశిష్టమైన పూజలు తప్పకుండా ఫలిస్తాయని అన్నారు. అయితే, లాక్‌డౌన్ సందర్భంగా ప్రజలెవరినీ ఆలయం వద్దకు అనుమతించలేదని, ప్రజలంతా ఎవరి ఇళ్ళలో వాళ్ళు పూజలు చేసుకోవాలని సూచించామని తెలిపారు. ఈ పూజల్లో వెంకటగిరి రాజకుటుంబీకులు డా.విబి సాయికృష్ణయాచేంద్ర, సర్వజ్ఞకుమార యాచేంద్ర, సిఐ అన్వర్ బాషా తదితరులు పాల్గొన్నారు.



### సూర్యుని చుట్టూ వలయం..

వెంకటగిరి గ్రామశక్తి ఆలయం వద్ద రెండవరోజైన మంగళవారం నాడు శీతల దేవి యాగం నిర్వహిస్తుండగా సూర్యుని చుట్టూ ఇంద్రధనుస్సులా ఒక వలయం ఏర్పడింది. అది శక్తిస్వరూపమైన వెంకటగిరి పోలేరమ్మ రూపమేనంటూ ప్రజలు భక్తిశ్రద్ధలతో సూర్యునికి నమస్కరించుకున్నారు.

## డీసీసీబీ డిపాజిట్లు, రుణాలు రూ. వెయ్యి కోట్లు

**- ఆనం విజయ**



నెల్లూరుజిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) డిపాజిట్లు, రుణాలు కలిపి మొత్తం రూ. వెయ్యి కోట్లకు చేరుకుంది. ఈ నెల 4వ తేదీకి ఈ లక్ష్యం పూర్తి కావడంతో బ్యాంకు ఛైర్మెన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, అధికారులు, సిబ్బంది పరస్పరం అభినందనలు తెలుపుకున్నారు. కరోనా నేపథ్యంలో భౌతిక దూరం పాటించాల్సి రావడంతో అభినందనలతో, ఆనందోత్సాహాలతో పూర్తి చేసుకున్నారు. డీసీసీబీ డిపాజిట్లు ఈనెల 4వతేదీ నాటికి రూ.271 కోట్లు ఉన్నాయి. రూ. 721కోట్ల రుణాలను రైతులకు బ్యాంకు అందజేసింది. ఈ సందర్భంగా ఛైర్మెన్ మాట్లాడుతూ తమ బ్యాంకు ద్వారా, తమ బ్యాంకుకు అనుసంధానంగా ఉన్న 79 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ద్వారా జిల్లా రైతాంగానికి, స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలను అందజేస్తున్నామన్నారు. ఈ సంఘాల ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. బ్యాంకు ఖాతాదారులు, జిల్లా రైతాంగం కోవిడ్ -19 పరిస్థితుల దృష్ట్యా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.



కర్కశ కరోనా ప్రభావంతో ఆకలితో అలమటిస్తున్న 200 కుటుంబాల వారికి బెంగుళూరులోని తన ఇంటి వద్ద ఉచితంగా రేషన్ పంపిణి చేస్తున్న ప్రముఖ దాత జె.ఎస్.రెడ్డి.

# వర్ష భీభత్సం!



ఓ పక్క కరోనా వైరస్‌తో జన జీవనం అతలాకుతలమవుతోంది. మార్చి 22వ తేదీ నుండి అన్ని వ్యాపారా లావాదేవీలు, పనులు స్థంభించిపోయి వున్నాయి. బయట కొస్తే ఎక్కడ వైరస్ కాటుకు బలైపోతామోనని ప్రజలు హడలి చస్తున్నారు.

ఇలాంటి సమయంలో వూహించని విధంగా అకాల వర్షం జనాన్ని ఆశ్చర్యానికి గురి చేసింది. నెల్లూరు నగరంతో పాటు జిల్లాలో పలుచోట్ల గురువారం ఉదయం ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఏప్రిల్ నెలలో జిల్లాలో వర్షం కురియడం అన్నది చాలా అరుదు. చాలా ఏళ్లుగా నవంబర్ నెలలోనే వర్షాలు పడడం లేదు. అలాంటిది ఏప్రిల్ నెలలో భారీ వర్షం కురవడం ప్రజలను షాక్‌కు గురి చేస్తోంది. ఒక్క నెల్లూరు నగరంలోనే కాకుండా జిల్లాలోని పలు మండలాల్లో గురువారం భారీ వర్షం భీభత్సం సృష్టించింది. ఈదురుగాలులతో కూడిన వర్షం మూలంగా చాలాచోట్ల చెట్లతో పాటు విద్యుత్ స్థంభాలు కూడా నేలకొరిగాయి. దీంతో పలు ప్రాంతాల్లో కొన్ని గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కరోనా వైరస్ విధుల్లో వున్న వారికి సైతం ఈ వర్ష భీభత్సం విధులకు ఆటంకం కలిగించింది. జిల్లాలో చాలావరకు వరి కోతలు పూర్తి కావడంతో రైతాంగం కోలుకుంది. అప్పటికీ పలుచోట్ల కల్లాల్లోనే ధాన్యం తడిచిపోయి రైతులకు నష్టం వాటిల్లింది.

ప్రపంచమంతా లాక్‌డౌన్ మూలంగా అన్నీ మూతపడి, రవాణా వ్యవస్థ ఆగిపోయి కాలుష్యం తగ్గి, వాతావరణం మెరుగైంది. ఈ ఆనందంతో ప్రకృతి బాగా పరవశించినట్లుంది... అనుకోకుండా అకాల వర్షాలు పడుతున్నాయి.



## మనసున్న దాతలు.. మానవతా మూర్తులు...

# మన నెల్లూరోళ్లు

దానధర్మాలలో నెల్లూరీయులది అందవేసిన చేయి. తమతో పాటు చుట్టూ వున్న సమాజం బాగుండాలని కోరుకునే మనస్తత్వం నెల్లూరీయులది. దేశంలో ఎటువంటి వైపరీత్యాలు సంభవించినా సాటిమనిషిని ఆదుకోవడంలో నెల్లూరీయులు ఎప్పుడూ ముందుంటారు. కరోనా వైరస్ మహమ్మారి దేశాన్ని పట్టిపీడుస్తున్న తరుణంలో కూడా నెల్లూరీయులు తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. నెల్లూరోళ్లు చాలామంది అటు హైదరాబాద్‌లోనూ, ఇటు స్వంత రాష్ట్రం ఏపిలోనూ వివిధ రంగాలలో వున్నారు. వారంతా ఈ ఆపత్కాలంలో కేంద్రప్రభుత్వంతో పాటు ఇరు రాష్ట్ర ప్రభుత్వాలకు అండగా నిలుస్తున్నారు.

అరబిందో ఫార్మసీ తరపున ఆ సంస్థ డైరెక్టర్, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు పెనాక శరత్‌చంద్రారెడ్డి కేంద్ర ప్రభుత్వానికి 10కోట్ల రూపాయలు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి 11కోట్ల రూపాయలు, తెలంగాణ ప్రభుత్వానికి 11 కోట్ల రూపాయల సాయం అందించారు.

కరోనా వైరస్ నేపథ్యంలో మన భారతీయ ఆచారాలు, అలవాట్లను గురించి టీవీ ఛానెల్స్ ఇంటర్వ్యూలలో ఎంతో గొప్పగా వివరించిన శాంతా బయోటిక్స్ ఛైర్మెన్ వరప్రసాద్‌రెడ్డి, మాటల్లోనే కాదు చేతల్లోనూ తన మానవతను చాటుకున్నారు. సంస్థతో సంబంధం లేకుండా తన వ్యక్తిగతంగా తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసి సీఎం సహాయనిధికి కోటి నూటపదహారు రూపాయలు విరాళంగా అందజేశారు.

వంశీరామ్ బిల్డర్స్ అధినేత బి.సుబ్బారెడ్డి తన కుమార్తె సోహినితో కలిసి తెలంగాణ మున్సిపల్ శాఖామంత్రి కేటీఆర్‌కు కోటి రూపాయలు విరాళంగా అందజేశారు. అలాగే సైబరాబాద్ పోలీస్ కమిషనర్‌కు పోలీసుల సహాయనిధి కోసం 10లక్షల రూపాయలను విరాళంగా అందించాడు.

నారాయణ విద్యాసంస్థలు కూడా కోటి రూపాయలు విరాళం అందించాయి. కిమ్స్ హాస్పిటల్స్ తరపున తెలంగాణ సీఎం సహాయనిధికి కోటి రూపాయలు, తెలంగాణ పోలీస్ వెల్ఫేర్‌కు 50లక్షలు, ఆంధ్రప్రదేశ్ సిఎం సహాయనిధికి కోటిరూపాయలు, ఏపి పోలీస్‌కు 50 లక్షలు విరాళంగా అందజేశారు. ఆ సంస్థ అధినేత డాక్టర్ భాస్కర్‌రావు ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, డిజిపిలను కలిసి ఈ విరాళాలను అందించారు.

నెల్లూరుకు చెందిన అపర్ణ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ పిఎం కేర్‌కు 2కోట్ల రూపాయలు, అలాగే తెలంగాణ ముఖ్యమంత్రి సహాయనిధికి 2 కోట్ల రూపాయలను, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి సహాయనిధికి కోటి రూపాయలను విరాళంగా అందజేసింది.

అలాగే రెయిన్‌బో హాస్పిటల్స్ అధినేత డాక్టర్ కంచర్ల రమేష్ కోటి రూపాయలు విలువ చేసే 5వేల పిపిఇ కిట్స్‌ను, 10వేలు ఎన్95 మాస్కులను, 2లక్షలు మూడుపొరల మాస్కులను తెలంగాణ మున్సిపల్ మంత్రి కేటీఆర్‌ను కలిసి అందజేశారు.

ఇక నెల్లూరులో రెడ్‌క్రాస్ క్యాన్సర్ సెంటర్ వ్యవస్థాపక దాత జె.యస్.రెడ్డి 10లక్షల రూపాయల విరాళం చెక్కును నెల్లూరుజిల్లా కలెక్టర్ ఎంవి శేషగిరిబాబుకు పంపించారు. ఇక ఇటీవలే శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవి సన్నారెడ్డి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డిని కలిసి 2కోట్ల విరాళం అందజేసి రాష్ట్రం పట్ల తమ బాధ్యతను నిర్వర్తించిన విషయం మనకు తెలిసిందే! విపిఆర్ ఫౌండేషన్ ద్వారా రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తన ఎంపీ నిధుల నుండి విరాళం అందించడమే కాకుండా, జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలలో ప్రజలు కరోనా వైరస్ బారిన పడకుండా శానిటైజర్లు, మాస్కులను ఉచితంగా పంపిణీ చేస్తున్న విషయం కూడా తెలిసిందే! అలాగే నెల్లూరు ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డితో పాటు జిల్లాలోని ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పక్షాల నాయకులు, పారిశ్రామిక సంస్థలు భారీ ఎత్తున సేవా కార్యక్రమాల్లో పాల్గొంటుండడం, తమకు తగిన స్థాయిలో బాధితులను ఆదుకోవడం కోసం విరాళాలు పంపిస్తుండడం చూస్తూనే ఉన్నాం!

ఇలా నెల్లూరీయులు ఎక్కడ వున్నా, ఏ ప్రాంతంలో వున్నా మంచిని, మానవత్వాన్ని చాటుకుంటూ నెల్లూరు జిల్లాకే గర్వకారణంగా నిలుస్తున్నారు.



ఏపి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డికి విరాళం చెక్కును అందజేస్తున్న అరబిందో ఫార్మసి డైరెక్టర్ పెనాక శరత్‌చంద్రారెడ్డి, పక్కన ఎంపి విజయసాయిరెడ్డి



తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు విరాళం చెక్కును అందజేస్తున్న శాంతా బయోటిక్స్ ఛైర్మెన్ వరప్రసాద్‌రెడ్డి



తెలంగాణ మున్సిపల్ శాఖా మంత్రి కేటీఆర్‌కు విరాళం చెక్కును అందజేస్తున్న వంశీరామ్ బిల్డర్స్ అధినేత బి.సుబ్బారెడ్డి, కుమార్తె సోహిని



తెలంగాణ మున్సిపల్ శాఖా మంత్రి కేటీఆర్‌కు విరాళం చెక్కును అందజేస్తున్న రెయిన్‌బో హాస్పిటల్స్ సిఎండి డాక్టర్ కంచర్ల రమేష్



ఏపి సీఎం వైయస్ జగన్మోహన్‌రెడ్డికి విరాళం చెక్కును అందజేస్తున్న కిమ్స్ అధినేత డాక్టర్ బి.భాస్కర్‌రావు

### ఉప రాష్ట్రపతి వెంకయ్య పిలుపుతో..

## వలస కార్మికులను ఆదుకొన్న స్వర్ణభారత్ ట్రస్ట్

లాక్‌డౌన్ నేపథ్యంలో వలస కార్మికులను, నిరాశ్రయులను ఆదుకోవాలంటూ భారత ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు పిలుపునందుకుని స్వర్ణభారత్ ట్రస్ట్ విజయవాడ చాప్టర్ ఆధ్వర్యంలో విజయవాడ చుట్టు పక్కల ఉన్న పోలీస్‌స్టేషన్ల పరిధిలోని వలస కార్మికులను ఆదుకునేందుకు పెద్దఎత్తున చర్యలు చేపట్టారు. విజయవాడ పరిసర ప్రాంతాల్లో దాదాపు 1200 మంది వలస కార్మికుల వివరాలతో ఆంధ్రప్రదేశ్ హోంశాఖ రూపొందించిన అధికారిక జాబితా ఆధారంగా విజయవాడ స్వర్ణభారత్ ట్రస్ట్ ఏప్రిల్ 8 నుంచి 14 వరకు వలస కార్మికులకు భోజనం సమకూర్చేందుకు ఏర్పాట్లు చేసింది. రాష్ట్ర పోలీస్ శాఖ సూచించిన విధంగా అన్నం ప్యాకెట్లలో 450 గ్రాముల భోజనం, ఒక మంచినీళ్ళ బాటిల్, రెండు అరటిపండ్లు, ఒక బిస్కట్‌ప్యాకెట్‌లను పోలీసుశాఖ



సహాయంతో స్వర్ణభారత్ మిత్రమండలి సభ్యులు జోన్ల వారీగా పంపిణీ చేస్తున్నారు. విజయవాడ నగర పోలీస్ కమిషనర్ తిరుమలరావు చేతుల మీదుగా ఈ కార్యక్రమం ప్రారంభమైంది. ఇంత మంచి సేవా కార్యక్రమాన్ని నిర్వహించేందుకు స్వర్ణభారత్ ట్రస్ట్‌కి పూర్తి సహాయ సహకారాలందించిన జిసిఎం బెనర్జీకి నిర్వాహకులు ధన్యవాదాలు తెలిపారు.



కరోనా వైరస్ ప్రబలి లాక్‌డౌన్ విధించిన నేపథ్యంలో నెల్లూరులో నిరాశ్రయులుగా మారి ఆకలితో అలమటిస్తున్న వందలాదిమంది అన్నార్తులను ముప్పవరపు ఫౌండేషన్ షటిల్ అసోసియేషన్ ఆదుకుంటోంది. అసోసియేషన్ నాయకులు చంద్రశేఖర్‌రాజు ఆధ్వర్యంలో ప్రతిరోజూ నిరాశ్రయులకు ఆహారపొట్లాలు, నిత్యావసర వస్తువులు, పండ్లను అందజేస్తున్నారు.

# 'ప్రభా'తం

## ప్రపంచం కోలుకునేనా?

ఎవరైనా అనుకున్నారా... ప్రపంచానికి ఈ పరిస్థితి వస్తుందని! ఏ మేధావి అయినా వూహించాడా... ఒకేసారి వందకుపైగా దేశాలలో ప్రజలు అన్నీ మూసుకుని ఇళ్ళకే పరిమితం అవుతారని? ఏ మేధావైనా పసిగట్టాడా... అగ్రరాజ్యాలు సైతం శవాల గుట్టలుగా మారుతాయని?

దీనిని ప్రకృతి మాయ అనుకోవాలా? లేక పర్యావరణానికి చేటు చేస్తున్నందుకు మానవ ప్రపంచానికి దేవుడిచ్చిన రిటర్న్ గిఫ్ట్ అనుకోవాలా?

కంటికి కనిపించని వైరస్ ఈరోజు ప్రపంచాన్నే ఇంట్లో కూర్చోబెట్టింది. 209 దేశాలకు విస్తరించిన కరోనా వైరస్ వందకుపైగా దేశాల ఆర్థిక వ్యవస్థలను ఛిన్నాభిన్నం చేసినట్లే! ఈ వైరస్ మూలంగా ఎంత ప్రాణనష్టం జరుగుతుందో, ఎంత ఆర్థిక నష్టం జరుగుతుందో ఇప్పుడే అంచనా వేయలేని పరిస్థితి.

కరోనా వైరస్‌కు ప్రధానంగా బలైపోయిన దేశం ఇంతకాలం అగ్రరాజ్యంగా వెలిగిపోతూ వచ్చిన అమెరికా! కరోనా వైరస్ పట్ల చూపిన నిర్లక్ష్య వైఖరికి ఆ దేశం ఇప్పుడు తగిన మూల్యం చెల్లిస్తోంది. కరోనా వైరస్ అత్యంత ప్రమాదకరంగా మారి, ఎన్నో దేశాలను అతలాకుతలం చేస్తున్న తరుణంలో కూడా అమెరికా ముందుగా జాగ్రత్త పడలేదు. బహుశా ఇలాంటి సంక్షోభ సమయంలో ఆ దేశ అధ్యక్షుడిగా డోనాల్డ్ ట్రంప్ వుండడం కూడా అమెరికన్‌ల దౌర్భాగ్యంగా చెప్పుకోవచ్చు. ఎందుకంటే ట్రంప్ పక్కా వ్యాపారవేత్త, అతను ఆర్థిక ప్రయోజనాలకు ఇచ్చినంత ప్రాధాన్యత ప్రజల ప్రాణాలకు ఇవ్వలేదు. భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలలోనే ఆర్థిక నష్టాలను గురించి ఆలోచించకుండా ముందుగానే లాక్‌డౌన్ ప్రకటించాడు ప్రధాని మోడీ. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మాత్రం లాక్‌డౌన్ ప్రకటిస్తే ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిపోతుందంటూ నిర్లక్ష్యం చేశాడు. తీరాచూస్తే కరోనా కేసులలో అగ్రరాజ్యం ఒక్కసారిగా దూసుకుపోయింది. కేసుల సంఖ్య 5లక్షలకు చేరువకాగా, మరణాలు 13వేలు దాటాయి. స్వయంగా అధ్యక్షుడు ట్రంపే 2లక్షల మంది వరకు మరణించవచ్చని అంచనాలు వేస్తున్నాడు. తన దేశ ప్రజలలో ఆయన ధైర్యం నింపే ప్రయత్నం చేయకపోగా, చావులకు సిద్ధం కండి అన్నట్లు ప్రకటనలు చేస్తూ ప్రజలను విస్మయానికి గురి చేస్తున్నాడు.




కరోనా వైరస్ మూలంగా అగ్రరాజ్యం అమెరికాతో పాటు యూరప్, గల్ఫ్ దేశాలు తీవ్ర ఆర్థిక సంక్షోభానికి గురికానున్నాయి. చైనా, భారత్‌లలో కూడా ఆర్థిక సంక్షోభం తప్పదు. అయితే ఈ సంక్షోభం నుండి ముందుగా బయటపడే దేశం చైనా! వాళ్ళు సృష్టించిన కరోనా వైరస్ మూలంగా ఆ దేశం భవిష్యత్‌లో ఎన్నో ఆర్థిక ప్రయోజనాలను పొందే అవకాశముంది. ఇక ఈ ఆర్థిక సంక్షోభం నుండి భారతదేశం కూడా తొందరగానే బయటపడొచ్చు. ఇది స్వయం సమృద్ధి దేశం. ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా తట్టుకోగలదు.

అమెరికా పెను ప్రమాదంలో వుంది. ఆ దేశంలో కేసుల సంఖ్య రోజురోజుకీ అధికమవుతోంది. అయితే ఈ సమయంలో అమెరికాకు ఆపన్న హస్తం అందించాల్సిన బాధ్యత కూడా మనమీద వుంది. ఇటీవలకాలంలో అమెరికాతో మన స్నేహ సంబంధాలు ఎంతో దృఢంగా వున్నాయి. అదీగాక భారతీయులు భారతదేశం తర్వాత అధికంగా నివసిస్తున్నది అమెరికాలోనే! ప్రత్యక్షంగా, పరోక్షంగా భారతదేశంలో ఆర్థిక పురోభివృద్ధికి అమెరికాలోని ప్రవాసభారతీయులు ఎంతగానో తోడ్పాటునందిస్తున్నారు. భారతదేశ ఆర్థిక వ్యవస్థను నాశనం చేయడానికి చైనా కాసుక్కుచుంటే, అమెరికా మాత్రం మనకు అంతో ఇంతో అండగా వుంది. కాబట్టి ట్రంప్ కోరిన విధంగా హైడ్రాక్సిన్ క్లోరోక్విన్ ఔషధాలను, నిబంధనలను సడలించైనా ఆ దేశానికి ఎగుమతి చేయడానికి కేంద్రం ముందుకు రావడం ఎంతైనా అభినందనీయం. అయితే, భారత్ మాకు హైడ్రాక్సిన్ క్లోరోక్విన్ మందులను ఇవ్వకుంటే ఆ దేశం అంతు చూస్తామంటూ ట్రంప్ చేసిన ప్రేలాపలనలు మాత్రం క్షమించదగినవి కావు. ఈ సంక్షోభ సమయంలో ప్రతి దేశం కూడా ఇచ్చిపుచ్చుకునే ధోరణితోనే ఉండాలి. ఒకరి అవసరాలు ఒకరు తీర్చుకోవాలి. మనకు అవసరం లేని వాటితో అవతలి వారి అవసరం తీరుతుందంటే త్యాగం చేయాలి! భారత్ ఈ ఆపత్కాలంలో అటు వంటి పాత్రనే పోషించింది. హైడ్రాక్సిన్ క్లోరోక్విన్ ఇతర దేశాలకు ఎగుమతి చేయకూడదంటూ కొన్ని రోజుల క్రితమే విధించుకున్న నిషేధాన్ని తాత్కాలికంగా సడలించి కోరిన అన్ని దేశాలకు కూడా ఈ ఔషధాలను సరఫరా చేస్తూ ప్రపంచం పట్ల భారత్ తన మానవతా దృక్పథాన్ని చాటుతోంది.

కరోనా వైరస్ మూలంగా అగ్రరాజ్యం అమెరికాతో పాటు యూరప్, గల్ఫ్ దేశాలు తీవ్ర ఆర్థిక సంక్షోభానికి గురికానున్నాయి. చైనా, భారత్‌లలో కూడా ఆర్థిక సంక్షోభం తప్పదు. అయితే ఈ సంక్షోభం నుండి ముందుగా బయటపడే దేశం చైనా! వాళ్ళు సృష్టించిన కరోనా వైరస్ మూలంగా ఆ దేశం భవిష్యత్‌లో ఎన్నో ఆర్థిక ప్రయోజనాలను పొందే అవకాశముంది. ఇక ఈ ఆర్థిక సంక్షోభం నుండి భారతదేశం కూడా తొందరగానే బయటపడొచ్చు. ఇది స్వయం సమృద్ధి దేశం. ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా తట్టుకో గలదు. 20 నుండి 30 శాతం వరకు వున్న వ్యాపార రంగం మాత్రం కోలుకోవడానికి కొంత ఎక్కువ సమయం పట్టొచ్చు. వ్యవసాయ, కార్మిక, చిన్న, సన్న వ్యాపార వర్గాలు దేశంలో తొందరగానే కోలుకోవచ్చు. అయితే అమెరికా ఆర్థిక సంక్షోభంలో కూరుకు పోతే, ఆ ప్రభావం ప్రపంచ దేశాలపై ఎక్కువగానే వుంటుంది. ముఖ్యంగా సాఫ్ట్‌వేర్ రంగం కుదేలైతే ఉపాధి అవకాశాల పరంగా ఎక్కువగా నష్టపోయేది భారతీయులే! కాబట్టి అమెరికా తొందరగా కోలుకోవడం మనకు కావాలి. అలాగే ప్రపంచం ఈ సంక్షోభం నుండి గట్టెక్కితేనే సాధారణ పరిస్థితులు నెలకొంటాయి. ఇలాంటి మామూలు వాతావరణం రావడానికి ఇంకెంతకాలం పడుతుందో చూడాలి?!

## క్వారంటైన్ వార్డుల్లో సదుపాయాలు పెంచండి

### - వైద్యాధికారులను ఆదేశించిన కలెక్టర్



నెల్లూరు జిల్లా జి.జి.హెచ్ ఆస్పత్రిలోని కోవిడ్ -19 క్వారంటైన్ వార్డును రీజినల్ సెంటర్‌గా ప్రకటించిన నేపథ్యంలో ప్రభుత్వం జారీ చేసిన మార్గ దర్శకాలకు అనుగుణంగా వైద్య సదుపాయాల ఏర్పాట్లను పటిష్టంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ యం.వి.శేషగిరిబాబు, జి.జి.హెచ్. మెడికల్ సూపరింటెండెంట్ డా. శ్రీహరి, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా. సాంబశివరావులను ఆదేశించారు.

సోమవారం రాత్రి నెల్లూరులోని జి.జి.హెచ్.ను జిల్లా కలెక్టర్ సందర్శించి వైద్య ఏర్పాట్లపై సంబంధిత ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ తో సమీక్షించి తగు సూచనలు, ఆదేశాలు జారీచేశారు. ప్రభుత్వం జారీ చేసిన నిబంధనల ప్రకారం అన్ని వసతులు ఉండాలని వైద్యశాఖ అధికారులకు స్పష్టం చేశారు. కోవిడ్ – 19 క్వారంటైన్ వార్డులో చేపట్టాల్సిన ఏర్పాట్లు, అవసరమైన అన్ని వైద్య పరికరాలు, మెడిసిన్స్ గురించి నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్, సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ భాస్కర్ భూషణ్, జాయింట్ కలెక్టర్ డా.పి.వినోద్‌కుమార్, ట్రైనీ కలెక్టర్ కల్పనాకుమారి, నుడా వైస్‌చైర్మన్ బాపిరెడ్డి, డి.ఆర్.డి.ఎ పి.డి శీనానాయక్, జి.జి.హెచ్. సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### నిరాడంబరంగా...

## లక్ష్మీనృసింహునికి వసంతోత్సవాలు



జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పెంచలనకోనలోని పెనుశిల లక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో ఈనెల 5న ఎంతో నిరాడంబరంగా స్వామివారి వసంతోత్సవాలకు అంకురార్పణ జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు సీతారామయ్యస్వామి ఆధ్వర్యంలో శ్రీవారి నందనవనంలోని పుట్టమట్టిని తీసుకువచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. కరోనా, లాక్‌డౌన్‌ల నేపథ్యంలో భక్తులెవరూ లేకుండా వసంతోత్సవాలకు అంకురార్పణ కార్యక్రమాలను ఆలయ నిర్వాహకులు ఏకాంతంగా చేపట్టారు.

## కఠిన చర్యలే మేలు

కొన్ని విపత్కర పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోక తప్పదు. దేశ భద్రత కంటే ముఖ్యమైంది ఏదీ లేదు. దేశ భద్రతకు సవాళ్ళు విసురుతూ కొందరు మతోన్మాదంతో దేశమంతటా కరోనా వైరస్ వ్యాప్తి చేయాలని చూస్తున్నారు. ఇలాంటి వారిని ఉపేక్షిస్తే దేశానికి పెద్ద ప్రమాదం. ఇలాంటి ఉన్మాదులను ఎన్‌కౌంటర్ చెయ్యాలి. ప్రభుత్వాలు, పార్టీలు ఓటు బ్యాంకు రాజకీయాలు వీడి దేశ భద్రత గురించి కూడా ఆలోచించాలి.

**– సి.రాజీవి, నెల్లూరు.**




## దేశం నిండా శాడిస్టులు

9 నిముషాలు దీపాలు వెలిగిస్తే కరోనా పోతుందా? అంటూ దేశంలో చాలామంది నాయకులు, మేధావులు ప్రధాని నరేంద్ర మోడీ ఇచ్చిన 'దీపయజ్ఞం' పిలుపుకు పెడర్థాలు తీశారు. వీరిలో రాహుల్‌గాంధీ అనే మేధావి కూడా ఉండడం గమనార్హం. 9 నిముషాలు దీపాలు వెలిగించినంత మాత్రాన కరోనా పోదు. కాని ఒకే సమయంలో దేశమంతటా దీపాలు వెలిగించడమన్నది మన సమైక్యతకు నిదర్శనం. దేశమంతా ఒకే మార్గంలో పయనిస్తోంది. కేంద్రప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తుందన్న దానికి సంకేతం. ఆ మాత్రం జ్ఞానం లేకుండా కారుకూతలు కూయడం సిగ్గుచేటు. మరి వీళ్ళంతా గతంలో ఎన్నో సంఘటనలు జరిగినప్పుడు కొవ్వొత్తుల ర్యాలీలు ఎందుకు నిర్వహించారో...?

**ఎన్.సి.వి.కృష్ణారెడ్డి, నెల్లూరు.**

## మతాలను నియంత్రించాలి

భారతదేశంలో విచ్చలవిడి మత స్వేచ్ఛ పెనుప్రమాదాలకు దారితీస్తోంది. మతాల మధ్య ఘర్షణలకే కాకుండా దేశానికి కూడా ముప్పుగా మారుతోంది. దేశంలో మత స్వేచ్ఛపై ఆంక్షలు విధించాల్సివుంది. మతాన్ని ఇంటికి, ప్రార్థనా మందిరాలకే పరిమితం చేయాలి. మత ప్రచారాలను పూర్తిగా అరికట్టాలి. మత ప్రచారకుల ప్రసంగాలపై కూడా నిఘా పెట్టాలి.

**మేకల సతీష్, నెల్లూరు.**

## తూట్లు పొడిచారు

నిజాముద్దీన్ తబ్లిగ్ జమాత్ సంఘటన లేకపోతే కరోనాను అదుపు చేయడంలో ప్రపంచ దేశాలలోనే భారత్‌కు ఒక ప్రత్యేక ఇమేజ్ వచ్చి వుండేది. ఈ సదస్సు లేకపోయి వుంటే దేశంలో కరోనా పాజిటివ్ కేసులు కేవలం నగరాలు, పట్టణాలకే పరిమితమై వుండేవి. దేశంలో కొంత ప్రశాంత వాతావరణం వుండేది. ఢిల్లీ సదస్సు మూలంగా కరోనా వైరస్ పల్లెటూర్లకు కూడా పాకిపోయి, అక్కడి ప్రజలు కూడా ప్రశాంతత కోల్పోయే పరిస్థితులొచ్చాయి.

**సి.భవ్య, నెల్లూరు.**

# లాక్‌డౌన్... జిల్లాలో ఎత్తేయడం అనుమానమే?




ఈ నెల 14వ తేదీకి 21రోజుల లాక్‌డౌన్ ముగియబోతోంది. 14 తర్వాత లాక్‌డౌన్ ఎత్తేయడానికి అవకాశాలు కనిపించడం లేదు. ఈ నెలాఖరు దాకా లాక్‌డౌన్‌ను పొడిగించే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ దిశగా రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్రం సంకేతాలు అందజేసింది.

అయితే ఈ నెలాఖరు తర్వాత నెల్లూరుజిల్లాలో లాక్‌డౌన్ ఎత్తేస్తారా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఎందుకంటే కేంద్రం ప్రకటించిన రెడ్‌జోన్ జిల్లాలో నెల్లూరు కూడా వుంది. కేసుల సంఖ్యలో రాష్ట్రంలోనే నెల్లూరుజిల్లా రెండవ స్థానంలో వుంది. కాబట్టి లాక్‌డౌన్ ఎత్తేయడమంటే కరోనా వైరస్‌ను స్వాగత కటౌట్‌లుపెట్టి ఆహ్వానించడమే! కాబట్టి జిల్లాలో పూర్తిస్థాయి లాక్‌డౌన్‌ను ఎత్తేసే పరిస్థితులు ఎంత మాత్రం కనిపించడం లేదు. కాని కేసులు పెరగకుండా నిలకడగా వుంటే మాత్రం లాక్‌డౌన్ పూర్తిగా ఎత్తేయకున్నా కొన్ని ఆంక్షలు సడలించవచ్చు.

జిల్లాలో నెల్లూరు నగరంలోనే ఎక్కువ కేసులున్నాయి. కాబట్టి నగరంలో షాపింగ్ మాల్స్, సినిమాహాల్స్, హోటల్స్ వంటి వాటికి అప్పుడే విముక్తి లభించకపోవచ్చు. సభలు, శుభకార్యాలకు అప్పుడే అవకాశముండదు. విద్యాసంస్థలు తెరచుకునే ప్రశ్న లేదు. జనం పెద్దగా గుమికూడని వ్యాపారాలకు అవకాశం కలిగించవచ్చు. ప్రభుత్వ కార్యాలయాలు, పరిమిత సంఖ్యలో సిబ్బంది వుండే ప్రైవేట్ కార్యాలయాలు, పరిశ్రమలు, వ్యాపార సంస్థలు తిరిగి తెరుచుకోవడానికి అవకాశముంటుంది. అది కూడా పూర్తి జాగ్రత్తలతో, ప్రభుత్వ నిబంధనలకు లోబడే వుండే విధంగా కార్యకలాపాలు జరగాల్సి వుంటుంది. జిల్లాలో పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ అప్పుడే ప్రారంభం కాకపోవచ్చు. వ్యక్తిగత వాహనాలలో ప్రయాణానికి అనుమతించే అవకాశాలున్నాయి.

జిల్లాలో నెల్లూరు తర్వాత అత్యధిక కేసులున్న పట్టణం నాయుడుపేట. ఇక్కడ కూడా ఇంకొంత కాలం లాక్‌డౌన్ ఆంక్షలు అమలు కావచ్చు. అలాగే కరోనా పాజిటివ్ కేసులున్న మండలాల్లో ఆంక్షలు సడలించకపోవచ్చు. కరోనా కేసులు నమోదు కాని మండలాలలో మాత్రం వ్యవసాయ పనులతో పాటు ఇతర వ్యాపార కార్యకలాపాలను కొనసాగించే వీలుంది. అయితే ఇవి మండల పరిధిలోనే జరగాల్సి వుంటుంది. ఇతర మండలాల నుండి ఈ వైరస్ లేని మండలాల పరిధిలోకి ప్రజలను అప్పుడే అనుమతించకపోవచ్చు. ముఖ్యంగా వైరస్ నమోదు కాని మండలాలను ఒక జోన్‌గా, వైరస్ వున్న మండలాలను రెడ్‌జోన్‌గా ప్రకటించి, ఈ జోన్‌లకు ఒకదానితో ఒక దానికి సంబంధం లేకుండా చేసి ఆంక్షలను సడలించే సూచనలున్నాయి.



# కరోనాకు ఆదివారం సెలవా?



చాపల అంగడి ముందు గుంపులుగా గుమ్మిగూడిన జనం

కరోనా వైరస్ నేపథ్యంలో ప్రజలంతా సోమవారం నుండి శనివారం దాకా లాక్‌డౌన్ నిబంధనలను విధిగా పాటిస్తున్నారు. కూరగాయల మార్కెట్ వద్దకుపోతే క్యూలో నిలబడి భౌతిక దూరం పాటిస్తున్నారు. ముఖాలకు మాస్క్‌లు తగిలిస్తున్నారు. గంటకోసారి చేతులకు శానిటైజర్‌లు పూస్తున్నారు. ప్రొవిజన్ షాపుల వద్దకు వెళ్లినా పద్ధతిగా కొనుగోలు చేస్తున్నారు. ప్రధాని నరేంద్ర మోడీ చప్పట్లు కొట్టమంటే కొడుతున్నారు, దీపాలు వెలిగించమంటే వెలిగిస్తున్నారు. జనం వారంలో ఆరు రోజులు బాగానే వుంటున్నారుగాని, ఆ ఏడోరోజు మాత్రమే అదుపు తప్పుతున్నారు. ఆదివారం రోజు మాత్రం కరోనా వైరస్‌కు హాలిడే, మనకు జాలీడే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. లాక్‌డౌన్ నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు. భౌతిక దూరాన్ని మరుస్తున్నారు. ఆ ఆదివారం చికెన్ కొట్లు, మటన్ దుకాణాలు, చేపల మార్కెట్ ముందు గుంపులు గుంపులుగా పోగవుతున్నారు. నాన్‌వెజ్ కోసం ఎగబడుతున్నారు. వైరస్ ప్రబలడానికి ఒక వ్యక్తి చాలు. ఒక మటన్ కొట్టు వద్ద వైరస్ వున్న ఒక వ్యక్తి చాలు... వేలమందికి వైరస్ అంటించడానికి! నెల్లూరుజిల్లా అంతటా ఆదివారం అయితే ఇలాంటి వాతావరణమే నెలకొంటోంది. అసలు వైరస్ పూర్తిగా నిర్మూలించే వరకు నాన్‌వెజ్ మార్కెట్లను మూసేయడం మంచిదేమో ఉన్నతాధికారులు ఆలోచించాలి..!

## లాక్‌డౌన్ సమయంలో ప్రభుత్వ సూచనలు పాటించాలి

**- కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న**



లాక్‌డౌన్ సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సూచనలు ప్రజలందరూ తప్పనిసరిగా పాటించాలని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సూచించారు. ఈ నెల 5న కోవూరు మండలంలోని వసంతపురం గ్రామంలో వెయ్యిరూపాయల నగదు పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ప్రజల కష్టాలను తీర్చేందుకు సీఎం వైయస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని, ప్రాణాలను పణంగా పెట్టి డాక్టర్లు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, పోలీసులు, పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారని కొనియాడారు. నియోజకవర్గంలో 87,734 మంది లబ్దిదారులకు నగదు అందజేయడం జరిగిందన్నారు. తెల్లకార్డు లేని వారికి సైతం ప్రభుత్వం నగదు ఇస్తోందన్నారు. అధికారులు వివిధ ప్రాంతాల్లో వున్న నిరాశ్రయులను గుర్తించి వారిని వసతి కేంద్రాలకు తరలించడం సంతోషకరమన్నారు. ప్రజలు తప్పనిసరిగా స్వీయ నిర్బంధం పాటించాలన్నారు. అనంతరం మాస్కులు పంపిణీ చేశారు. తహశీల్దార్ సుబ్బయ్య, ఎంపిడిఓ శ్రీహరి, నిరంజన బాబురెడ్డి, పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, నలబోలు సుబ్బారెడ్డి, గుణపాటి తులసిరెడ్డి, ప్రసాదరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆదివారాల్లో మాంసపు కొట్లు బంద్

**- కమిషనర్ పివివిస్ మూర్తి**



కరోనా వైరస్ వ్యాప్తిని నివారించేందుకు తీసుకుంటున్న ముందస్తు చర్యల్లో భాగంగా నగరంలోని అన్ని మాంసపు దుకాణాలను ప్రతి ఆదివారం దినాల్లో మూసివేసేందుకు ఆదేశాలు జారీ చేసామని, మిగిలిన దినాల్లో భౌతిక దూరం పాటించకుండా విక్రయాలు జరిపే దుకాణాలపై భారీ జరిమానా విధించి, సరుకును జప్తు చేస్తామని నగర పాలక సంస్థ కమిషనర్ పివివిస్ మూర్తి హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం ఒక పత్రికా ప్రకటనను ఆయన విడుదల చేశారు. ప్రజల మధ్య భౌతిక దూరం పాటించకుండా మాంసపు దుకాణాల్లో నిర్లక్ష్యంగా జరుగుతున్న విక్రయాలపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు వచ్చాయని, జిల్లా కలెక్టర్ శేషగిరిబాబు సూచనల మేరకు పై ఆదేశాలను పటిష్టంగా అమలు చేస్తామని ఆయన స్పష్టం చేసారు.

ప్రభుత్వ మార్గదర్శకాల ద్వారా ఏర్పాటు చేసిన కూరగాయల విక్రయ కేంద్రాలలో ప్రజలు పాటిస్తున్న భౌతిక దూరం నిబంధనలు అన్ని మాంసపు విక్రయ కేంద్రాల్లో సైతం అమలయ్యేలా ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తామని కమిషనర్ పేర్కొన్నారు. వరుసగా మూడు ఆదివారాలపాటు ఈ నిబంధన అమలులో ఉంటుందని, నిబంధన కొనసాగింపు తదుపరి ప్రభుత్వ నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని కమిషనర్ తెలిపారు.

## శానిటైజర్ ద్రావణం తయారీకి షార్ సాయం

**శాస్త్రవేత్తలను అభినందించిన ఉన్నతాధికారులు**

కరోనా మహమ్మారిని నిరోధించేందుకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ తనవంతు సాయం అందజేస్తోంది. ఇప్పటికే వెంటిలేటర్లు, ఆక్సిజన్ యంత్రాలు, మాస్కుల తయారీకి సహకరించిన ఇస్రో తాజాగా జిల్లాలోని షార్ సెంటర్ శాస్త్రవేత్తలు 1200 లీటర్ల శానిటైజర్ ద్రావణం తయారుచేశారు. ప్రపంచ ఆరోగ్యసంస్థ నిబంధనల మేరకు దీనిని రూపొందించారు. శానిటైజర్ ద్రావణాన్ని సీసాల్లో నింపి ఇక్కడ పనిచేసే ఉద్యోగులకు, శ్రీహరికోటలోని ప్రజలకు పంపిణీ చేశారు. శానిటైజర్ తయారీలో పాల్గొన్న శాస్త్రవేత్తలను షార్ సంచాలకు ఆర్ముగం రాజరాజన్, ఏ.డి ఎంబిఎన్ మూర్తి, డాక్టర్ రంగనాథన్, డి.డి వెంకట్రామన్ తదితరులు అభినందించారు.






నెల్లూరు కబుర్లు

# బాధ్యత నెరవేర్చిన అనిల్



కరోనా వైరస్ ప్రజలను వణికిస్తున్న తరుణంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాల్సిన సమయం ఇది. తమకు వైరస్ రాదనే భ్రమల నుండి అందరూ బయటపడాలి. కరోనా వైరస్ సోకిన వ్యక్తులతో ఏ మాత్రం దగ్గరగా, సన్నిహితంగా వ్యవహరించి వున్నా వెంటనే క్వారంటైన్‌లో వుండి, వైద్య పరీక్షలు చేయించుకోవాలి. కరోనా నెగటివ్ అని రిపోర్టులు వచ్చిన తర్వాత క్వారంటైన్ నుండి బయటకు రావాలి. ఈ బాధ్యతను మంత్రి పి.అనిల్‌కుమార్‌యాదవ్ నిర్వర్తించాడు. నెల్లూరు నగరంలో ప్రముఖ డాక్టర్‌కు కరోనా పాజిటివ్ రావడం తెలిసిందే. అంతకుముందు కొన్ని రోజులక్రితం ఆయన తన ఆసుపత్రి ప్రారంభో త్సవం కోసం మంత్రి అనిల్‌కుమార్‌ను కలిసి ఆహ్వాన పత్రికను అందించాడు. అతనికి కరోనా పాజిటివ్ అని తెలిసిన తర్వాత మంత్రి అనిల్ బాధ్యతాయు తంగా 36 గంటల పాటు సెల్ఫ్ క్వారంటైన్‌లో ఉండిపోయి వైద్యపరీక్షలు చేయించుకున్నాడు. వైద్య పరీక్షల్లో కరోనా నెగెటివ్ అని రిపోర్టు వచ్చాకే మళ్ళీ బయటకు వచ్చి అధికారిక కార్యక్రమాలలో పాల్గొంటున్నాడు.

### ఎన్‌సిసి ఆధ్వర్యంలో..

## మాస్కులు, ఆహారపొట్లాలు



నెల్లూరులోని 10-ఆంధ్ర నౌకాదళ యూనిట్, ఎన్‌సిసి నెల్లూరు కమాండింగ్ ఆఫీసర్ కెప్టెన్ యుగంధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 5న పట్టణంలోని పలు ప్రాంతాల ప్రజలకు మాస్కులు, ఆహారపొట్లాలు అందజేశారు. నగరంలోని భక్తవత్సలనగర్ ప్రాంతంలోని అనగుంట మురికివాడ, ఆర్‌టిఓ కార్యాలయం పరిసరప్రాంతాలైన పోలేరమ్మ గుడి ప్రాంతాల్లో పేద లకు ఈ సహాయం అందజేశారు. కరోనా రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. శానిటైజర్‌తో అందరి చేతులు శుభ్రం చేసి ఆహారపొట్లాలు అందించారు. లాక్‌డౌన్ నేపథ్యంలో పేదప్రజలకు ఈ సేవా కార్యక్రమం నిర్వహించామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిసి అసోసియేట్ అధికారులు సివి సురేష్, ఎన్ ప్రభాకర్, గుండాల నరేంద్రబాబు, పిఐ స్టాఫ్ నవీన్, శ్రీకాంత్, మితేల్, రమణ, దేముడునాయుడు, వీరభద్రారెడ్డితో పాటు స్థానిక వాలంటీర్లు సునీత, దివ్య పాల్గొన్నారు.

## భగవాన్ మహావీర్ జయంతి

జైనమతానికి సంబంధించిన 24వ తీర్థంకరుడు భగవాన్ మహావీర్ జయంతిని పురస్కరించుకుని ఈనెల 6వ తేదీన నెల్లూరు కాపువీధిలోని జైన్‌భవన్‌లో మహావీర్ చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. లాక్‌డౌన్ కారణంగా ప్రత్యేక కార్యక్రమాలను రద్దుచేశారు. నగరంలోని జైనులు ఎంతో భక్తిశ్రద్ధలతో తమ ఇళ్ళల్లోనే భగవాన్ మహావీర్‌కు పూజలు, అభిషేకాలు చేసుకున్నారు.

## బిజేపి ఆవిర్భావ దినోత్సవం

### - నిరుపేదలకు యశ్వంత్ సింగ్ సహాయం



భారతీయ జనతా పార్టీ 40వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిరుపేదలకు సహాయ కార్యక్రమాలను నిర్వహించారు ఆ పార్టీ నేత యశ్వంత్‌సింగ్. నెల్లూరు రాజేంద్రనగర్‌లో పార్టీ పతాకాన్ని ఎగుర వేశారు. అనంతరం కరోనా వైరస్ నేపథ్యంలో సాగుతున్న లాక్‌డౌన్ తో గుప్తాపార్కు, పాత మున్సిపల్ ఆఫీస్ తదితర ప్రాంతాల్లో పనులు లేక పూట గడవ డమే కష్టంగా ఉన్న కుటుంబాలను గుర్తించి వారికి బియ్యం బస్తాలు, గోధుమ పిండి, ఇతర వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా యశ్వంత్‌సింగ్ మాట్లాడుతూ ఈ ప్రాంతాల్లో నివసించే వారికి కనీసం రేషన్ కార్డులు కూడా లేవని, దాని కారణంగా వారు ప్రభుత్వం అందజేసే పథకాలకు దూరంగా ఉంటున్నారని వెల్లడించారు. ప్రభుత్వం వీరిపై దృష్టి పెట్టాలని విజ్ఞప్తి చేశారు.

## జగ్జీవన్‌రామ్ సేవలు అపారం



భారత ఉపప్రధాని, దివంగత బాబు జగ్జీవన్‌రామ్ దేశానికి చేసిన సేవలు అపారమైనవని జిల్లా కలెక్టర్ ఎంవి శేషగిరిబాబు కొనియాడారు. బాబు జగ్జీవన్ రామ్ 113వ జయంతి సందర్భంగా నెల్లూరు దర్గా మిట్టలోని జడ్పీ కార్యాలయం ఆవరణంలో ఉన్న ఎమర్జెన్సీ సెంటర్‌లోని జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జేసీ-2 కమలకుమారి, జడ్పీ సిఇఓ పి.సుశీల, సాంఘిక సంక్షేమశాఖ డి.డి జీవపుత్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## చెన్నైకి కరోనా డాక్టర్

నెల్లూరులో కరోనా సోకిన ఓ ఆర్థోపెడిక్ డాక్టర్‌ను నగరంలోని పెద్దాసుపత్రి నుంచి ఈనెల 6న మెరుగైన చికిత్స కోసం చెన్నైకి తరలించారు. 55ఏళ్ళ ఆ వైద్యునికి షుగర్, హైపర్‌టెన్షన్ కూడా ఉన్నాయని భావిస్తున్నారు. ఆ డాక్టర్‌కు కరోనా పాజిటివ్ వచ్చిన నేపథ్యంలో, ఆయన గత పదిహేను రోజులుగా ఎవరె వరితో ఉన్నారో గుర్తించి వారిని కూడా వైద్యశాఖ అధికారులు క్వారంటైన్‌కు తరలిస్తున్నారు. ఈ ఆర్థోపెడిక్ వైద్యుని వద్ద వైద్యం చేయించుకున్న రోగులు, ఆసుపత్రి ప్రారంభోత్సవ కార్యక్రమానికి వెళ్ళిన డాక్టర్లతో సహ అందరికీ కరోనా పరీక్షలు నిర్వహించారు. వైద్యులు, రోగులకు నెగెటివ్ రిపోర్టులు వచ్చాయి.

## రంగనాథునికి కల్యాణోత్సవం

నెల్లూరు రంగనాయకులపేటలో కొలువైవున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ రంగనాథస్వామివారి ఆలయంలో ఈనెల 6న పంగున్యుత్తర కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కిడాంబి జగన్నాధాచార్యులు, నిశింద సుదర్శనాచార్యుల ఆధ్వర్యంలో రంగనాథస్వామిని, రంగనాయకి అమ్మవారిని శోభాయమానంగా అలంకరించి కల్యాణం నిర్వహించారు. ఆలయ ఇ.ఓ వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు. కరోనా నేపథ్యంలో ఈ వేడుకకు భక్తులెవరినీ అనుమతించలేదు.

## నోడల్ అధికారిగా బాపిరెడ్డి

నెల్లూరుజిల్లా ప్రభుత్వాసుపత్రి నోడల్ అధికారిగా నుడా వైస్‌ఛైర్మన్ టి.బాపిరెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఈ నెల 4న ఆదేశాలు జారీ చేసింది. నెల్లూరుజిల్లా నుండే కాకుండా ఇతర జిల్లాల నుండి కరోనా వ్యాధిగ్రస్తులు జిజిహెచ్‌కు వచ్చే అవకాశం ఉన్నందున వైద్యసిబ్బంది విధులను సమన్వయం చేసేందుకు సమర్థవంతమైన అధికారిని నియమించాలని భావించిన ప్రభుత్వం, బాపిరెడ్డిని నోడల్ అధికారిగా నియమించింది. గత ఏడాదిగా బాపిరెడ్డి డ్వామా పిడిగా, జడ్పీ సిఇఓగా బాధ్యతలు నిర్వర్తించారు. ఇటీవల జిల్లా పరిషత్ ఎన్నికలకు సంబంధించి రిటర్నింగ్ అధికారిగా కూడా బాధ్యతలు నిర్వర్తించారు. జిల్లాలో కోవిడ్ కేసులు పెరగడంతో రోగులను క్వారంటైన్, ఐసోలేషన్‌కు పంపడం, బెడ్లు ఏర్పాటు చేయడం, వసతులు కల్పించడం, ప్రభుత్వానికి, జిల్లా పాలనాధికారికి సమాచారం అందించేందుకు బాపిరెడ్డి సమర్థవైన అధికారిగా భావించిన ప్రభుత్వం, ఆయనను నోడల్ అధికారిగా నియమించింది.

### 15 నుంచి

## ఆర్టీసీ బస్సులకు రిజర్వేషన్లు!

ఈ నెల 14తో దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ గడువు ముగియనుండగా, ఇప్పటికే ఎయిర్ ఇండియా మినహా మిగతా పౌర విమానయాన సంస్థలు 15వ తేదీ ప్రయాణాలకు బుకింగ్స్ ప్రారంభించాయి. లాక్ డౌన్‌ను తొలగిస్తూ, కేంద్రం నిర్ణయిస్తే, 15వ తేదీ నుంచి రైళ్లను నడిపించేందుకు సిద్ధమని చెప్పిన ఇండియన్ రైల్వేస్, ఇప్పటికే బుకింగ్స్‌ను స్వీకరించడం ప్రారంభించాయి. ఇక, ఏపీఎస్ ఆర్టీసీ సైతం 15 నుంచి బుకింగ్స్‌ను ప్రారంభించింది. ఓపీఆర్ఎస్ ద్వారా ప్రయాణికులు రిజర్వేషన్ ప్రస్తుతం కొనసాగుతోంది. ప్రస్తుతానికి ఏసీ బస్సులకు మాత్రం ఇంకా రిజర్వేషన్ మొదలు కాలేదు. ఏసీ బస్‌లను ఎక్కేందుకు ప్రజలు ఆసక్తి చూపించక పోవచ్చన్న ఉద్దేశంలో అధికారులు ఉన్నారని తెలుస్తోంది. కాగా, విజయవాడ నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే 127 రైళ్లకు 15 నుంచి బుకింగ్స్ ఇప్పటికే మొదలైన సంగతి తెలిసిందే.

## పోలీసుల సేవలు భేష్

### - జిల్లా ఎస్పీ ప్రశంస

కరోనా మహమ్మారిని అరికట్టేందుకు జిల్లా వ్యాప్తంగా తీసుకుంటున్న చర్యల్లో భాగంగా పోలీసులు నిర్వహిస్తున్న సేవలు ఎంతో అభినందనీయమని జిల్లా ఎస్పీ భాస్కర్ భూషణ్ ప్రశంసించారు. లాక్‌డౌన్ నేపథ్యంలో కావలి సబ్‌డివిజన్ పరిధిలోని పోలీసులు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమన్వయంతో సేవలు అందజేస్తుండడాన్ని ఆయన అభినందించారు. కావలి సబ్‌డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఆయన ఈనెల 4న పర్యటించారు. చెక్‌పోస్టులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రజలు పోలీసులకు సహకరిస్తున్నారన్నారు.

### రెండో పంటకు

## 20 టిఎంసిల నీరు ఇస్తున్నాం

### - నీటిపారుదల శాఖ ఎస్ఇ వెల్లడి

జిల్లాలో రెండో పంట సాగుకు డెల్టాకు 20 టిఎంసిల నీటిని కేటాయిస్తున్నట్లు జిల్లా నీటిపారుదలశాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ ప్రసాద్‌రావు ఈనెల 7న ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రస్తుతం సోమశిలలో ఉన్న నీటి లభ్యతను దృష్టిలో పెట్టుకుని 2,47,000 ఎకరాలకు గాను 1,80,000 ఎకరాల అధీకృత ఆయకట్టు సాగుకు అనుమతించామని, సోమశిల ప్రాజెక్టు కాలువల కింద ప్రతిపాదించిన ఆయకట్టులో కావలి కాలువకు 4.44 టిఎంసిలు, జికెఎస్ కాలువలకు 1.940 టిఎంసిలు, దక్షిణ కాలువకు 1.120 టిఎంసిల నీటిని కేటాయించామని ఆయన పేర్కొన్నారు.

### శ్రీ వేణుగోపాలస్వామి

## బ్రహ్మోత్సవాలు రద్దు

నెల్లూరు మూలాపేటలోని శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి వారికి ఈనెల 3 నుండి 13వ తేదీ వరకు జరిగే బ్రహ్మోత్సవాలను రద్దు చేసినట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, ఛైర్మెన్ మన్నెం లక్ష్మీనాథ్‌రెడ్డి తెలిపారు. కరోనా మహమ్మారి దేశంలో విజృంభిస్తుండడంతో నెల్లూరులో ఎక్కువ కేసులు నమోదు కావడం వల్ల బ్రహ్మోత్సవాలు జరగడం భక్తుల ఆరోగ్య దృష్ట్యా మంచిది కాదని ప్రభుత్వం, దేవాదాయ శాఖ ఆదేశాల మేరకు రద్దు చేయడమైందన్నారు. శ్రీ స్వామి, అమ్మవార్లకు జరిగే నిత్యకైంకర్యాలు యధావిధిగా ఆలయ అర్చకులు నిర్వహిస్తారని తెలిపారు. శ్రీ స్వామి అమ్మవార్ల కృపతో దేశంలో ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని ప్రార్థించడం జరిగిందన్నారు.

### సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన

## పోలీసు అధికారుల సంఘం



కరోనా వైరస్ నియంత్రణకు కృషి చేస్తున్న పోలీసులు, వైద్య ఆరోగ్య, శానిటేషన్ సిబ్బందికి పూర్తి వేతనాలు మంజూరు చేసిన సీఎం వైయస్ జగన్మోహన్‌రెడ్డికి ఏపి పోలీసు అధికారుల సంఘం ఈ నెల 5న కృతజ్ఞతలు తెలిపింది. సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాదరావు, కోశాధికారి తురకా శ్రీనివాసులు, బెల్లంకొండ రమణయ్య, రాష్ట్ర గౌరవ సలహాదారులు వై.శ్రీహరి, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎస్‌కె గౌస్‌బాషా వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు. ఆర్థిక సంక్షోభ పరిస్థితుల్లోనూ పోలీసులపై ఉన్న ఒత్తిడి, బాధ్యత, కష్టాలను, త్యాగాలను పరిగణలోకి తీసుకుని మార్చి నెల పూర్తి జీతం మంజూరు చేస్తూ ముఖ్యమంత్రి ఉత్తర్వులు జారీ చేశారన్నారు. పోలీసు సిబ్బందికి శానిటైజర్లు, మాస్కులు అందించిన మంత్రులు అనిల్‌కుమార్‌యాదవ్, మేకపాటి గౌతంరెడ్డి, ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పోలీసు సిబ్బంది సంక్షేమానికి కృషి చేస్తున్న ఎస్పీ భాస్కర్‌భూషణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## రైల్వే చెక్‌పోస్టులు ఏర్పాటు

లాక్‌డౌన్ నేపథ్యంలో రహదారులపై పోలీసు అధికారులు రాకపోకలను నిషేధించారు. ఇతర రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి ప్రజలు రైలు పట్టాల వెంబడి నడుచుకుంటూ తమ గమ్య స్థానాలకు చేరుకుంటున్నారు. వీరిని నియంత్రించేందుకు నెల్లూరు జిఆర్‌పిఎఫ్, ఆర్‌పిఎఫ్ అధికారులు సంయుక్తంగా చర్యలు చేపట్టారు. తడ రైల్వేస్టేషన్ వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేయడంతో పాటు రైలు పట్టాలు వెంబడి పలుచోట్ల పికెట్లను ఏర్పాటు చేశారు. రైలు పట్టాలు వెంబడి ఎవరూ వెళ్లకుండా చర్యలు తీసుకున్నారు. లాక్‌డౌన్ నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటున్నామని నెల్లూరు రైల్వే డిఎస్పీ జి.వసంత కుమార్ ఈ నెల 5న తెలిపారు. రైలు పట్టాలు వెంబడి ఎవరైనా వెళుతూ కనిపిస్తే 9618232115 నెంబరుకు సమాచారం అందజేస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

## 108 సిబ్బంది సేవలు అపూర్వం

కరోనా వైరస్ నేపథ్యంలో తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా నెల్లూరు నగరంలో బాధ్యతలు నిర్వర్తిస్తున్న 108 సిబ్బందిని ఈనెల 7న ఏపిజిఇఏ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కరోనా బాధితులను 108 వాహనాలలో తరలిస్తున్న సిబ్బంది సేవలు అపూర్వమైనవని సంఘం నాయకులు ఏనుగు రమణారెడ్డి, చేజర్ల సుధాకర్‌రావు కొనియాడారు.

## ముసిరిన కరోనా చీకట్లను చీలుస్తూ...

# వెలిగిన చైతన్యదివ్వెలు



**ఆయన మాట మంత్రమైంది... ఆయన పిలుపు ప్రభంజనమైంది... ఒక మాటను ఒక దేశం ఆదరించింది. 130కోట్ల జనాలను ఏకతాటిపైకి తెచ్చింది. దేశమంతా ముసిరిన కరోనా చీకట్లను చీలుస్తూ కోట్లాది చైతన్య దీపాలను ప్రజ్వరిల్లేలా చేసింది. ఈ వెలుగు చీకటిపై విజయానికి సంకేతం. వెలిగిన జ్యోతులు 130 కోట్ల భారతీయుల సమైక్యతకు చిహ్నం.**











కరోనా వైరస్‌పై సాగిస్తున్న పోరాటంలో భాగంగా ఈ నెల 5వ తేదీ రాత్రి 9 గంటలకు దేశ వ్యాప్తంగా ప్రతి ఇంటా విద్యుత్ లైట్లు ఆర్పేసి జ్యోతులు, కొవ్వొత్తులు, టార్చ్‌లైట్లు, సెల్ టార్చర్‌లు వెలిగించాలన్న భారత ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుకు అసేతు హిమాచలం స్పందించింది. 5వ తేదీ రాత్రి 9 గంటలకు దేశంలోని ప్రతి ఇంటి లైట్లు ఆఫ్ చేయగా, కొన్ని సెకండ్లలోనే కొన్ని కోట్ల దీపాలు వెలిగాయి. ఈ దీపాలు కరోనాపై యుద్ధంలో దేశమంతా సమమైక్యంగా వుందని చాటాయి. అంతేకాదు, కరోనాపై సమరంలో దేశానికి సైన్యాధ్యక్షుడిగా వ్యవహరిస్తూ ముందుకు నడుస్తున్న నరేంద్ర మోడీ వెంటే జాతి మొత్తం నడుస్తుందనే సంకేతాన్ని చాటాయి. రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్ మొదలుకొని ఉపరాష్ట్రపతి, ప్రధాని, కేంద్రమంత్రులు, ముఖ్యమంత్రులు, అన్ని రకాల ప్రజాప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, క్రీడాకారులు, సామాజికవేత్తలు, మేధావుల నుండి సామాన్య ప్రజలు, ఆఖరకు గ్రామాలలోని ఆదివాసీలు సైతం ఈ దీపయజ్ఞంలో భాగస్వాములు కావడం దేశ చరిత్రలోనే అతిపెద్ద మార్పుగా చెప్పవచ్చు. నెల్లూరు జిల్లాలో మంత్రి డాక్టర్ పి.అనిల్‌కుమార్‌యాదవ్, ఆత్మకూరులో మంత్రి గౌతంరెడ్డిలతో పాటు అన్ని ప్రాంతాల్లోని ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు అందరూ ఎవరికి వారు తమ ఇళ్ళలో దీపజ్యోతులతో వెలుగులు నింపుకున్నారు. కరోనాపై అలుపెరుగని పోరాటానికి సమాయత్తమవుతూ అందరికీ స్ఫూర్తినింపారు. నగరంతో పాటు అన్ని పల్లెలు, పట్టణాలు.. ప్రతి ప్రాంతం..ప్రతి వీధి..ప్రతి ఇల్లూ దీప కాంతులతో..ఆరోగ్య జ్యోతులతో కళకళలాడాయి. జాతి సమైక్యతకు సంకేతంగా, కరోనా వైరస్‌పై పోరాటానికి నిదర్శనంగా జిల్లా మార్గదర్శకంగా నిలిచింది.

## కరోనాకు కలిసికట్టుగా పారద్రోలుతాం

**- దీపం వెలిగించిన కలెక్టర్ శేషగిరిబాబు**



ప్రజలంతా ప్రభుత్వానికి సహకరిస్తే కరోనా వైరస్‌ను పూర్తిగా నిర్మూలించవచ్చునని నెల్లూరు జిల్లా కలెక్టర్ ఎమ్.వి.శేషగిరి బాబు పిలుపునిచ్చారు. ప్రధాని మోడీ పిలుపు మేరకు ఆయన ఆదివారం రాత్రి 9 గంటలకు నెల్లూరులోని జిల్లా పరిషత్ కార్యాలయంలో లైట్లు ఆఫ్ చేసి ఇతర అధికారులతో కలిసి కొవ్వొత్తులు వెలిగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శేషగిరి బాబు మీడియాతో మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ప్రజలందరూ స్వయం నియంత్రణ పాటిస్తూ, లాక్‌డౌన్ నిబంధనలు ఖచ్చితంగా అమలు చేస్తూ కరోనా వైరస్ నియంత్రణ పోరాటంలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేసారు. కార్యక్రమంలో జేసీ డా. వినోద్‌కుమార్, జేసీ–2 కమలకుమారి, జడ్పీ సి.ఇ.ఓ సుశీల, డిఆర్‌ఓ జి.మల్లికార్జున, తెలుగుగంగ స్పెషల్ కలెక్టర్ నాగేశ్వర రావు, జడ్పీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో

## నిరుపేదలకు ఆహారం పంపిణీ



కరోనా వైరస్ నియంత్రణకు లాక్‌డౌన్ నేపథ్యంలో నెల్లూరు నగరంలో రోడ్ల పక్కన జీవిస్తున్న అనేకమంది నిరుపేదలకు తమ వంతు సాయంగా నెల్లూరు రెడ్‌క్రాస్ ఛైర్మెన్ పి.చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 7న ఆహారపొట్లాలు అందజేశారు. జడ్పీ ఉన్నత పాఠశాల, దర్గామిట్ట మసీదు, పాత మునిసిపల్ ఆఫీసు, ఇఎస్‌ఆర్‌ఎం పాఠశాల, నవాబుపేట ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన పేదల పునరావాస కేంద్రాల్లో ఉన్న సుమారు 6 వందల మంది నిరుపేదలకు రాత్రి భోజనంతో పాటు వాటర్‌ప్యాకెట్లు, ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన మందులు అందజేశారు.

అంతేకాక, రెడ్‌క్రాస్ సభ్యులు నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ మీదుగా కెవిఆర్ పెట్రోల్‌బంక్ వరకు, మూలపేట, పొదలకూరు రోడ్డు, సంతపేట తదితర ప్రాంతాల్లో పోలీసులతో కలసి పని చేస్తున్నారు. కరోనా మహమ్మారి నేపథ్యంలో ప్రజలెవరూ బయట రోడ్ల మీద తిరగకుండా నియంత్రిస్తున్నారు. రెడ్‌క్రాస్‌కు చెందిన 5 వాహనాలను కూడా నగరంలో తిరుగుతూ ప్రజలకు కరోనా నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించేందుకు వినియోగిస్తున్నారు. లాక్‌డౌన్ రోజుల్లో 21 రోజుల పాటు రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని రెడ్‌క్రాస్ ఛైర్మెన్ చంద్రశేఖర్‌రెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమటీ సభ్యులు బయ్యా ప్రసాద్, యల్‌వి నరసారెడ్డి, రంగయ్యనాయుడు, అంకయ్యచౌదరి, యడవలి సురేష్, రీజనల్ కోఆర్డినేటర్ గంటా వెంకటరవికుమార్‌తో పాటు రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

## బీజేపీ పతాకావిష్కరణ

భారతీయ జనతాపార్టీ 40వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 6వ తేది ఉదయం నెల్లూరు నగరంలోని బిజెపి కార్యాలయంలో పార్టీ పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి నేటిదాకా పార్టీ దేశానికి చేస్తున్న సేవలను వివరించారు. 1980 ఏప్రిల్ 6వతేదీన దివంగత నేత అటల్‌బిహారి వాజ్‌పేయి, ఎల్‌కె అద్వాని తదితరుల నాయకత్వంలో ఏర్పడిన పార్టీ, నాటి నుండి ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని దాదాపు 15 కోట్ల మంది సభ్యులతో నేడు ప్రపంచం లోనే అతిపెద్ద పార్టీగా అవతరించిందని, ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో రెండవసారి అధికారంలోకి వచ్చిందని వివరించారు. ప్రధాని మోడీ ఆధ్వర్యంలో దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ఈ తరుణంలో కరోనా మహమ్మారి దేశాన్ని అవస్తలకు గురిచేస్తోందని, ఈ మహమ్మారి వ్యాధిని పారద్రోలేందుకు ప్రధాని మోడీ పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నారని, అందుకు ప్రజలంతా సహకరించాలని ఆయన కోరారు.

ఈ కార్యక్రమంలో ఓబిసి మోర్చా రాష్ట్ర కార్యదర్శి ముక్కు రాధాకృష్ణగౌడ్, ఎస్‌సి మోర్చా రాష్ట్ర కార్యదర్శి బి.శ్రీనివాసులు, కె.సుధీర్, బిజెవైఎం నగర ఉపాధ్యక్షుడు వి.హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## 2వేల కుటుంబాలకు కూరగాయలు

నెల్లూరుజిల్లా చిల్లకూరు మండలంలోని 8 గ్రామాల్లో దాదాపు రెండువేల కుటుంబాలకు ఈనెల 5న గూడూరు ఎమ్మెల్యే వర ప్రసాదరావు చేతులమీదుగా వైయస్సార్సీపీ నాయకుల దాతృత్వంతో కూరగాయలు పంపిణీ చేశారు. ముత్యాలపాడు పంచాయితీలో జడ్పీటీసీ అభ్యర్థి మన్నెం శీనయ్య, ఉడతావారిపాళెం పంచాయితీలో ఏఎంసీ ఛైర్మెన్ నల్లారెడ్డి రమేష్‌రెడ్డి పేదలకు కూరగాయలు అందజేశారు. వైయస్సార్సీపీ మండల కన్వీనర్ అన్నంరెడ్డి పరంధామరెడ్డి, యారం వెంకటసుబ్బయ్య, కట్టా రామచంద్రారెడ్డి, కనపర్తి దిలీప్‌రెడ్డి, దువ్వూరు దిలీప్‌రెడ్డి, సన్నారెడ్డి చంద్రారెడ్డి, సుబ్బయ్య, సందాని తదితరులు పాల్గొన్నారు.

### రెడ్‌జోన్ ప్రాంతాల్లో..

## పటిష్టంగా పారిశుధ్య చర్యలు

**- మంత్రి గౌతమ్‌రెడ్డి**



కరోనా వైరస్ పాజిటివ్ కేసులతో రెడ్‌జోన్‌లుగా ప్రకటించిన ఆయా ప్రాంతాల్లో కట్టుదిట్టంగా పారిశుధ్య పరిరక్షణ చర్యలు చేపట్టాలని మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈనెల 6న ఆయన నెల్లూరులోని జడ్పీ సమావేశ మందిరంలో అధికారులతో సమావేశమై కరోనా వైరస్‌ను నియంత్రించేందుకు జిల్లాలో తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. కోవిడ్ కేంద్రాల్లో ఐసొలేషన్ వార్డులు, క్వారంటైన్‌లకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తిస్థాయిలో ఉండాలని, తగినన్ని వెంటిలేటర్లు కొనుగోలు చేయాలని అధికారులకు చెప్పారు. కరోనా వైరస్ నిర్ధారణ కిట్స్ త్వరలోనే జిల్లాకు వస్తాయని మంత్రి తెలిపారు. సాధారణ వ్యాధులతో బాధలుపడుతున్న వారికి టెలీ వైద్యసేవలు అందించేందుకు ఏర్పాట్లు చేశామని, నిరాశ్రయులకు కేటాయించిన ప్రాంతాల్లో ఉన్న పేదలకు నిర్ణీత సమయాల్లో ఆహారం అందించాలని మంత్రి సూచించారు. రైతులను అన్నివిధాలా ఆదుకోవాలన్నారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కోవిడ్ ప్రత్యేక అధికారి రాంగోపాల్, జిల్లా కలెక్టర్ ఎంవి శేషగిరిబాబు, ఎస్పీ భాస్కర్ భూషణ్, జేసీ వినోద్‌కుమార్, నుడా వైస్‌ఛైర్మెన్ బాపిరెడ్డి, డిఆర్‌ఓ మల్లికార్జున, జడ్పీసిఇఓ సుశీల తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరురూరల్‌లో కూరగాయలు పంపిణీ

నెల్లూరురూరల్ పరిధిలోని కాకుపల్లి, సౌత్‌మోపూరు, మొగళ్ళపాలెం గ్రామాల్లోని నిరుపేదలు, వలస కూలీలకు నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి 5రోజులకు సరిపడా తొమ్మిది రకాల కూరగాయలను ఈ నెల 4న పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ లాక్‌డౌన్‌తో నిరుపేదలు, వలస కూలీలకు పూట గడవడం కష్టంగా మారిందని, వారందరినీ స్థానిక నాయకులు, అధికారులు ఆదుకోవాల్సిన అవసరం వుందన్నాడు. కరోనా నియంత్రణకు ప్రజలు భౌతిక దూరం పాటించాలన్నాడు.

# గూడూరు డివిజన్ వార్తలు

## నెల్‌క్యాస్ట్ ఉద్యోగుల వితరణ



సబ్‌కలెక్టర్ గోపాలకృష్ణకు చెక్కును అందజేస్తున్న నెల్‌క్యాస్ట్ సిబ్బంది

గూడూరు నెల్‌క్యాస్ట్ మేనేజ్‌మెంట్ వారు గూడూరు సబ్‌కలెక్టర్‌కు కరోనా వైరస్ నివారణ సహాయార్థము ఈ నెల 8వ తేదీ రూ.3,50,000/-లు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో కంపెనీ సీనియర్ జీఎం ఆపరేషన్స్ ఎన్.ఎస్.రెడ్డి, జీఎం ఫైనాన్స్ డి.రవీంద్రనాథ్‌రెడ్డి, కంపెనీ పిఆర్‌ఓ ఎ.శివకుమమార్, గూడూరు సబ్‌కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణకు ఇవ్వడం జరిగింది. అలాగే జిల్లా కలెక్టర్ అభ్యర్థన మేరకు నెల్‌క్యాస్ట్ యాజమాన్యం సుమారు 5 లక్షల విలువగల 10వేల శానిటైజర్స్ ఇవ్వడం జరిగింది. నాయుడుపేట ఆర్డీఓ, ఎమ్మెల్యే అభ్యర్ధన మేరకు 2లక్షల రూపాయల చెక్కును కరోనా నివారణకు అందజేశారు.

## ముఖ్యమంత్రి సహాయనిధికి లక్ష విరాళం

**- గూడూరు ఆంధ్ర మహిళామండలి, ఇన్నర్‌వీల్‌క్లబ్‌ల ఔదార్యం**



సబ్‌కలెక్టర్‌కు చెక్కును అందజేస్తున్న జీవనిరెడ్డి, డాక్టర్ సి.రోహిణి, ఇంద్రసేనమ్మ తదితరులు

కరోనా మహమ్మారిని తరిమి కొట్టేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు తమవంతు సహాయంగా గూడూరులోని ఆంధ్ర మహిళా మండలి, ఇన్నర్‌వీల్‌క్లబ్‌లు సంయుక్తంగా రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయనిధికి లక్ష రూపాయల విరాళం ప్రకటించారు. గూడూరు సబ్‌కలెక్టర్ గోపాలకృష్ణకు ఆ మొత్తాన్ని అందించారు. ఆంధ్ర మహిళామండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ సి.రోహిణి, అధ్యక్షురాలు ఇంద్రసేనమ్మ, ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు జీవనిరెడ్డి, సంస్థల కార్యదర్శులు విష్ణువందన, సుప్రియ, ప్రభారెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## పేద బ్రాహ్మణులకు ఫలసరుకులు



ఫలసరుకులు పంపిణీ చేస్తున్న ఆలూరు శిరోమణిశర్మ, శివకుమార్

గూడూరులో ఉన్న పేద బ్రాహ్మణ కుటుంబాలకు నెల్లూరు శ్రీ తిక్కన మహాకవి లలిత కళా పీఠము వ్యవస్థాపక అధ్యక్షులు ఆలూరు శిరోమణిశర్మ ఆధ్వర్యంలో 15కేజీల బియ్యం, ఫలసరుకుల, రూ.250 నగదును ఈనెల 8న పంపిణీ చేశారు. అమెరికాలోని హ్యూస్టన్, ఆస్టిన్ నగరాల తెలుగు బ్రాహ్మణుల ఆర్థిక సహాయంతో రావి రాజ్యలక్ష్మి జ్ఞాపకార్థం వారి కుమారుడు హరిత శిద్దేశ్వర రావి దాతృత్వంతో ఇవ్వడం జరిగిందని ఆలూరు శిరోమణిశర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవాసంఘం ఉపాధ్యక్షుడు ఆనిమెళ్ళ శివకుమార్, కార్యదర్శి చిట్టమూరు శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు డి.బి.శ్రీనివాసరావు, కడివేటి రామమూర్తి, పి.పురుషోత్తమరావు, ఏలూరి లలితమ్మ తదితర సభ్యులు పాల్గొన్నారు.

## పాత్రికేయులకు నిత్యావసర వస్తువులు

**- పేర్నాట శ్యాంప్రసాద్‌రెడ్డి**



పేర్నాటి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి ఈనెల 7న గూడూరు పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో పాత్రికేయులకు నిత్యావసర సరుకులు అందజేశారు. లాక్‌డౌన్ నేపథ్యంలో పాత్రికేయులు ఇబ్బంది పడకుండా ఆయన ఈ సాయం అందజేశారు.



ఆహారపొట్లాలు అందజేస్తున్న డాక్టర్ సి.జనార్దన్‌రెడ్డి, సురేష్‌బాబు

### చేగువేరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో

## ఆహారపొట్లాలు

గూడూరు 2వ పట్టణంలోని న్యూ ఇందిరానగర్ కాలనీవాసులకు స్థానిక చేగువేరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇటీవల ఆహారపొట్లాలు అందజేశారు. డాక్టర్ సి.జనార్దన్‌రెడ్డి, మండ్ల సురేష్‌బాబు చేతుల మీదుగా ఈ సాయాన్ని వారికి అందించారు. లాక్‌డౌన్ సందర్భంగా ప్రజలు ఇబ్బందులకు గురి కాకుండా ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వినోద్, అన్వర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## గూడూరు స్టేట్‌బ్యాంక్ సహాయం



ఆహారపొట్లాలు అందజేస్తున్న స్టేట్‌బ్యాంక్ సిబ్బంది సాహిదా, స్వరూప

లాక్‌డౌన్ సందర్భంగా ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా తమవంతు సాయంగా గూడూరు స్టేట్‌బ్యాంక్ వారు పట్టణంలోని 60 మంది పేదలకు ఆహారపొట్లాలు అందజేశారు. స్టేట్‌బ్యాంక్ సిబ్బంది సాహిదా, స్వరూప ఈ కార్యక్రమం నిర్వహించారు.

## జనవిజ్ఞాన వేదిక కూరగాయలు



లాక్‌డౌన్ కారణంగా అనేక ఇబ్బందులకు గురౌతున్న వారిని జె.వి.వి అన్నివిధాలా ఆదుకుంటూ సహాయం చేస్తోంది. ఈ క్రమంలో ఇటీవల అడపాల సందీప్ దాతృత్వంలో నిరుపేద కుటుంబాలకు ఫలసరుకులు మరియు కూరగాయలు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జె.వి.వి అధ్యక్షులు వేగూరు రాజేంద్రప్రసాద్, మనోహర్ గౌడ్, సాయికిరణ్ పాల్గొన్నారు.

## ప్రగతి సేవా సంస్థ బియ్యం పంపిణీ



ప్రగతి సేవా సంస్థ, గూడూరు ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదీ గూడూరు రెండవ పట్టణంలోని మధురెడ్డి కాలనీ, రాగిచెట్టు గిరిజన కాలనీలో ఉన్న 100కుటుంబాలకు మాజీ శాసన సభ్యులు సునీల్‌కుమార్, సేవాసంస్థ అధ్యక్షులు చంద్రశేఖర్, చెంచురామయ్య సహాయ సహకారాలతో 5కేజీల బియ్యం, నిమ్మకాయ, మామిడికాయ ఊరగాయ ప్యాకెట్లు పంపిణీ చేయడం జరిగింది. కార్యక్రమంలో వెంకటేశ్వర్లరాజు, పెంచలయ్య, సురేంద్ర, జి.చంద్రశేఖర్, సుబ్రహ్మణ్యం, ప్రజేంద్రరెడ్డి, మస్తానయ్య, ఆలీ, కరిముల్లా, ప్రభాకర్, నటశేఖర్, రాజేష్, సాయి, శ్యామ్ పాల్గొన్నారు.

## ఎల్ఐసి సిబ్బంది సేవలు



వాటర్ బాటిల్స్, బిస్కెట్లు అందజేస్తున్న ఎల్ఐసి సిబ్బంది

గూడూరులో పనిచేస్తున్న ఎల్ఐసి సిబ్బంది గూడూరులోని చెక్‌పోస్ట్ వద్ద పనిచేస్తున్న పోలీసు సిబ్బందికి, మునిసిపల్ పారిశుధ్య కార్మికులకు ఈనెల 7న బిస్కెట్లు, టీ, వాటర్‌బాటిల్స్ పంపిణీ చేశారు. ఏఐఐఇఏ పిలుపు మేరకు చేపట్టిన ఈ కార్యక్రమంలో ఐసిఇయు బ్రాంచ్ కార్యదర్శి ఎస్.శివకుమార్, సంయుక్త కార్యదర్శి డిబి శ్రీనివాసరావు, కోశాధికారి పి.జి దీక్షితులు, క్లాస్-1 ఆఫీసర్స్ అసోసియేషన్ కార్యదర్శి సిహెచ్ రాజశేఖరరెడ్డి, ఎన్.ప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు.

## పిఎస్ఆర్ ట్రస్ట్ మాస్కులు



గూడూరు మునిసిపాలిటీ మాజీ ఛైర్‌పర్సన్ పొణకా దేవసేన, పిఎస్ఆర్ ట్రస్ట్ ఛైర్మెన్, వైకాపా నాయకుడు పొణకా శివకుమార్ రెడ్డిల సంయుక్త ఆధ్వర్యంలో ఇటీవల గూడూరులోని పోలీసులకు, పురపాలకశాఖ అధికారులకు, పారిశుద్ధ్య సిబ్బందికి మాస్కులు, గ్లౌసులు, దుప్పట్లను పంపిణీ చేశారు. గూడూరు సిఐ దశరథ రామారావు, మునిసిపల్ కమిషనర్ ఓబులేసులతో కలిసి, ఎమ్మెల్యే వరప్రసాదరావు చేతుల మీదుగా వీటిని పంపిణీ చేశారు.

## రేపటి కాంతి కోసం

**- చిన్ని నారాయణరావు**
9440202942

తల్లి గర్భం నుంచి
పుడమిని చేరుకోవడానికి
తొమ్మిది నెలల వ్యవధి కావాలి
రెక్కలు సాచిన చీకటిని
పారద్రోలి వెలుతురు ఉషోదయానికి
ఓ రాత్రి కావాలి
పచ్చల హారం మెడలో
మెరవడానికి బంగారానికి
పుటం వేయాలి
శిశిరం పూలభాషలో
ఆకుపచ్చ దుప్పటి
కప్పుకుని వసంతమై రావడానికి
మరింత సమయమే కావాలి
రాత్రంతా కలువ ఒంటరై
వేచి చూస్తేనే
ఉషఃకిరణ కాంతితో
వికసిస్తుంది.
ఎన్నాళ్ళ పోరాట ఫలమో
స్వేచ్ఛావాయువుల స్వాతంత్ర్యమైంది.
అలాగే..
కనపడని బలీయమైన శత్రువును
జయించడానికి
మహమ్మారి కరోనాను పారద్రోలడానికి
మరింత సంయమనం కావాలి
ఇల్లే యుద్ధభూమిగా
సమరం సాగించాలి
అప్పుడే..రేపటి కాంతి
దీపమై ప్రకాశిస్తుంది.

# పినాకిని సత్యాగ్రహ(గాంధీ)ఆశ్రమంకి 100వ పుట్టినరోజు

భారతదేశ చరిత్రలో మహాత్మాగాంధీ స్థాపించిన ఆశ్రమాలలో ముఖ్యమైనవి మొదటిది ఉత్తర భారత దేశంలో స్థాపించిన ఆశ్రమం "సబర్మతి ఆశ్రమం" అయితే దక్షిణ భారతదేశంలో స్థాపించిన ఆశ్రమం" పినాకిని సత్యాగ్రహ ఆశ్రమం". దీన్నే "దక్షిణ సబర్మతి" అని పిలుస్తారు. ఈ ఆశ్రమాన్ని 1921 ఏప్రిల్ 7వ తేదీ మహాత్మాగాంధీ స్వయంగా ఆయన స్వహస్తాలతో ప్రారంభించారు. ఈ మహిమాన్విత క్షేత్రం 7-4-2020న 100 వ పుట్టిన రోజు జరుపుకుంది. ఈ సందర్భంగా ఆ ఆశ్రమ చరిత్రను పరిశీలిస్తే...

సత్యం అహింస మీద ఆధారపడి గాంధీ గారు సాగించిన స్వాతంత్ర పోరాటంకి సత్యాగ్రహ సైనికులను తయారు చేయడానికి దక్షిణ భారతదేశంలో శిక్షణాలయం ప్రారంభించాలని ఆలోచిస్తుండగా, 1890 సంవత్సరంలో ఒరిస్సా రాష్ట్రంలోని, గంజాం జిల్లాలో జన్మించిన హనుమంతరావు తన జీవితాన్ని అంకితం చేయాలని నిశ్చయించుకుని, 1915 సంవత్సరంలో గాంధీని హనుమంతరావు పూణే నగరంలో కలిశారు. గాంధీ వ్యక్తిత్వం పట్ల ఆకర్షితులై సబర్మతి ఆశ్రమంలో చేరి సేవ చేయడం ఆరంభించారు. హనుమంతరావు క్రమశిక్షణ, అంకితభావం గమనించి, గాంధీ ఆశ్రమం నడిపేందుకు కావలసిన అన్ని లక్షణాలు హనుమంతరావులో ఉన్నాయని గుర్తించి ఆశ్రమం ఏర్పాటు చేసే బాధ్యత ఆయన భుజస్కందాలపై ఉంచారు. పల్లిపాడులో 1894వ సంవత్సరంలో పుట్టిన చతుర్వేదుల వెంకటకృష్ణయ్య సబర్మతి ఆశ్రమంలో ఉంటూ హనుమంతరావుతో గాఢమైన స్నేహం ఏర్పడింది. పల్లెపాడులో పినాకినీ నది ఒడ్డున ఆశ్రమ ఏర్పాట్లు అన్నివిధాలా తగినదని చెప్పటంతో ఇద్దరు గాంధీ అనుమతితో పల్లెపాడు చేరుకున్నారు. కొండపర్తి పున్నయ్య వీరికి తోడయ్యారు. ఒక చేత స్వాతంత్ర్య సమరాన్ని, ఇంకొక చేత జమిందారు రైతు ఉద్యమాన్ని నడిపిన వీరనారీ శ్రీమతి



పొణకా కనకమ్మ ఆశ్రమానికి కావాల్సిన స్థలాన్ని ఇచ్చారు. చిదంబరం పెళ్లై మున్నగు వారితో కలసి తుపాకీ కేంద్రంగా ఉన్న ఆ స్థలాన్ని గాంధీ పరిచయంతో అహింసా కేంద్రంగా మార్చే ఆలోచన చేసి 9 ఎకరాల మామిడి తోపును కొని ఆశ్రమ స్థాపనకై ఇచ్చారు. చతుర్వేదుల వెంకట కృష్ణయ్య మరికొంత భూమిని సేకరించి సమకూర్చారు. 1921 ఏప్రిల్ 7న మహాత్మా గాంధీ నెల్లూరుకు రైలులో వచ్చారు. శ్రీమతి పొణకా కనకమ్మ భర్త సుబ్బరామిరెడ్డి ఇరువురు రైల్వేస్టేషన్ దగ్గరకు ఎద్దుల బండిలో వచ్చారు. బండిలో పెద్ద పరుపు వేసి గాంధీగారిని కూర్చుండబెట్టి పల్లెపాడుకి తీసుకుని వెళ్లారు. నిర్మాణానికి గాను కనకమ్మ తన ఒంటి మీద నగలను మహాత్మునికి విరాళంగా ఇచ్చింది. జీవితంలో తిరిగి నగలు ధరించవద్దని మహాత్ముడు ఆమె వద్ద ప్రమాణం తీసుకున్నాడు. 1921వ సంవత్సరం నవంబర్ 25 తేదీన ట్రస్ట్ డీడ్ ద్వారా ఆశ్రమాన్ని రిజిస్టర్ చేయించి, ప్రథమ ట్రస్టీలైన దిగుమర్తి హనుమంతరావు, వారి సతీమణి శ్రీమతి దిగుమర్తి బుచ్చి కృష్ణమ్మ, చతుర్వేదుల వెంకట కృష్ణయ్య, కొండపర్తి పున్నయ్య యావజ్జీవ ట్రస్టీలుగా, ఆశ్రమ సభ్యులనుండి ఎన్నుకోబడి మరి ఇద్దరు కలిసి బోర్డుగా వ్యవహరించేందుకు ఏర్పాటు చేశారు. ట్రస్టు బోర్డు సభ్యుల సంఖ్య ఆరుగురికి మించరాదని ఏర్పాటు చేశారు. గాంధీ గుజరాతీ స్నేహితులైన రుస్తుంజీ, గాంధీ నిరాడంబరత, ప్రేమ ఆదర్శ జీవితం, వారిపట్ల ఆకర్షితులై ఆశ్రమ నిర్మాణానికై 5వేల రూపాయల విరాళం ఇచ్చారు. జాతీయ కాంగ్రెస్ వారు 10,000 రూపాయలు, మునగాల రాజా 2 వేల రూపాయలు మరియు కొంత ధనాన్ని చందాల రూపంలో వసూలు చేసి ఆశ్రమాన్ని నిర్మించడం జరిగింది. తొలుత పూరిపాకలతో ప్రారంభమైన ఆశ్రమం 1925 నాటికి భవనాలు ఏర్పడ్డాయి. ఆ భవనానికి 'రుస్తుంజీ భవన్' అని నామకరణం చేసారు.

1923లో ఆశ్రమంలో బందిపోటు దొంగలు జొరపడి ఆశ్రమవాసులను కొల్లగొట్టి స్త్రీల వద్ద ఉన్న నగలను కూడా దొంగిలించడంమే కాకుండా, గాయాలపాలు చేసి పారిపోయారు. అయినప్పటికీ ఆశ్రమవాసులు పోలీస్ రిపోర్ట్ ఇవ్వకుండా తిండికి లేని వారు ఈ పని చేసి ఉంటారని సమాధానపడి ఊరుకుండినారు. ఈ ఉదంతం ఇతరుల అందరిలో సంచలనం కలిగించింది రిపోర్టు లేనప్పటికీ పోలీసులు ఈ దొంగలముఠాను పట్టుకుని ఆశ్రమవాసులను నిందితులపై సాక్ష్యాన్నిఇస్తే బందీలుగా చేస్తామని చెప్పినా, ఆశ్రమవాసులు నిందితులకు వ్యతిరేకంగా సాక్ష్యం ఇవ్వకుండా వదిలివేశారు. దొంగతనం చేసిన కొన్ని బంగారు ఆభరణాలను పోల్చుకొనుటకు దిగుమర్తి బుచ్చి కృష్ణమ్మని కోరగా నగలు తమవి వలె ఉన్నవి కాని తమవే అని నిర్ధారణగా చెప్పలేమని, అంగీకరించని కారణంగా ఆమె ప్రవర్తన చూసినంతనే దొంగలు విస్మయం చెంది, నేరగాళ్లను తామేనని ఒప్పుకొని, ఆ వృత్తాంతమును చేసింది వారేనని చెప్పివేశారు. కేసు రుజువై దొంగలకు శిక్ష పడింది. ఈ విషయం గాంధీకి తెలిసి ఆశ్రమవాసులు యొక్క, ముఖ్యముగా శ్రీమతి కృష్ణమ్మ యొక్క ధైర్యం ముందు ప్రవర్తనను మెచ్చుకున్నారు. ఆశ్రమవాసులకు ఇది ఒక గుణపాఠం అని, ఆదర్శంగా ఉండాల్సిన ఆశ్రమ సభ్యులు ఇలాంటి ఆకర్షించే విలువైన ఆభరణములు ధనమును కలిగి ఉండకూడదని మానివేశారు.

హనుమంతరావు మరణించిన తర్వాత కొంత కాలం కృష్ణమ్మ ఆశ్రమాన్ని నిర్వహించి సీతానగరం వెళ్ళిపోవడం జరిగింది. 1929లో రెండవ సారి మే11వతేదీన గాంధీగారు ఆశ్రమంకి విచ్చేయడం జరిగింది. అదే రోజు రాత్రి పల్లెపాడులో ఆశ్రమానికి విచ్చేసి ఆ రోజు రాత్రి అక్కడే బస చేయడం జరిగింది. ఆ సందర్భంలో ఆ ఊరి బ్రాహ్మణలు, బ్రాహ్మణ అగ్రహారంకి గాంధీజీని రావలసినదిగా కోరగా, దళితులను కూడా ఆ వీధిలో అనుమతిస్తేనే వస్తానని చెప్పి, అప్పుడే గాంధీ బ్రాహ్మణ వీధికి వెళ్లారని గ్రామ ప్రజలు చెప్తుండేవారు.

ఇలా గాంధీ మహాత్ముడు నడయాడిన పినాకిని సత్యాగ్రహ ఆశ్రమంలో దశాబ్దకాలం పాటు ఉచితంగా సేవచేసే భాగ్యం దొరికినందుకు అదృష్టవంతురాలుగా భావిస్తూ...

**- గూడూరు లక్ష్మి,**
MA(Gandhian Thoughts), LLB

---

# నెల్లూరు పెద్దాసుపత్రిలో వెంకన్నస్వామి

శ్రీను గల్పిక

*అది తిరుమల తిరుపతి దేవస్థానం. తెల్లవారుజామున 2 గంటల సమయం. కరోనా వైరస్‌తో దేవస్థానాలలో భక్తుల దర్శనాలు నిలిపివేసినప్పటికీ స్వామివారికి నిత్యపూజలు, కైంకర్యాలు నిర్వహిస్తున్నారు. ఆరోజు కూడా స్వామికి కైంకర్యాలు నిర్వహిద్దామని చెప్పి టీటీడీ ఛైర్మెన్ వై.వి.సుబ్బారెడ్డి, ఇ.ఓ అశోక్ సింఘాల్, అర్చకులు రమణదీక్షితులు, వేణుగోపాల దీక్షితులు, ఇతర అర్చకులు వచ్చారు. అందరూ చేతులు జోడించి దండం పెట్టుకుంటుండగా రమణదీక్షితులు గర్భగుడి తలుపులు తెరిచాడు. అంతే... అందరూ ఆశ్చర్యంతో నోరెళ్లబెట్టారు. ఎవరికీ నోట మాట రావడం లేదు. కారణం... గర్భగుడిలో వుండాల్సిన శ్రీ వేంకటేశ్వరస్వామి అక్కడ లేడు. మాయమయ్యాడు. దాంతో అందరిలో ఒకటే మదనం... ఏమైపోయాడు, ఎక్కడకు పోయాడు... ఇప్పుడు భక్తులకు ఏమని సమాధానం చెప్పాలి.. అందరిలోనూ ఈ ప్రశ్నలే! అందరికంటే ముందుగా వై.వి.సుబ్బారెడ్డి అల్లర్లై... క్రింద తిరుచానూరులోని పద్మావతి అమ్మవారి ఆలయం ప్రధానార్చకుడికి ఫోన్ చేశాడు. అతను ఫోన్ ఎత్తగానే... అమ్మవారి గర్భగుడి తలుపులు తీసి అమ్మవారు వున్నారో లేరో చూడమన్నాడు. ఆ అర్చకుడు అలాగే చేశాడు. అంతే అతని నోటకూడా ఒక్క నిముషం మాట రాలేదు. కొద్ది సేపటికి తేరుకుని... సార్, అమ్మవారు లేరు అని చెప్పాడు. వై.వి.సుబ్బారెడ్డి వెంటనే ఆ ఫోన్ కట్ చేసి శ్రీనివాసమంగాపురంలోని గుడి పూజారికి ఫోన్ చేసి, అమ్మవారి గర్భగుడి తలుపులు తెరచి అలివేలు మంగమ్మ అమ్మవారు వున్నారో లేదో చూడమన్నాడు. ఆ పూజారి కూడా అలాగే చేశాడు. అతనూ ఆశ్చర్యంతో... సార్, అమ్మవారు లేరు అని చెప్పాడు. దాంతో వై.వి.సుబ్బారెడ్డికి ఒక క్లారిటీ వచ్చింది... అక్కడున్న ఇ.ఓ, అర్చకులతో... మనమేమీ కంగారుపడాల్సిన పని లేదు. శ్రీవారు పద్మావతి, అలివేలు మంగమ్మ అమ్మవార్లతో కలిసి ఎక్కడికో చెక్కేశాడు, ఈ కరోనా ప్రభావం తగ్గి మళ్ళీ భక్తులొచ్చే వరకు ఆయన ఈ కరోనా హాలిడేస్‌ను ఎంజాయ్ చేయడానికి వెళ్లుంటాడు... ఆయనను కొద్దిరోజులు ఫ్రీగానే వుండనిద్దాం పదండి అంటూ అందరినీ అక్కడ నుండి తీసుకుని వెలుపలికి వచ్చేశాడు.*

★★★★★

*అది యమలోకం, సింహాసనం పై కూర్చుని యమధర్మరాజు ఈ టీవీలో వస్తున్న 'జబర్దస్త్' పాత ఎపిసోడ్‌లు చూస్తున్నాడు. చిత్రగుప్తుడు తన సీటు వద్ద కూర్చుని కునికిపాట్లు పడుతున్నాడు. అంతలో అక్కడకు 'నారాయణ నారాయణ'.. అంటూ నారద మహర్షి వచ్చాడు. ఆయనను చూడగానే యముడు జబర్దస్త్ చూడ్డం ఆపేసి... నారదుడిని కూర్చోబెట్టి... ఏంటి నారద విశేషాలు అని అడిగాడు. దానికి నారదుడు... విశేషాలు అంటూ ఏమీ లేవు... వున్నదల్లా ఒకే విశేషం... అదే కరోనా వైరస్. దాని సంగతేం కాని మీరేంటి ఇలా ఖాళీగా కూర్చున్నారు అని అడిగాడు. దానికి యమధర్మరాజు... అటువైపు చూడు అంటూ నారదుడికి వేలుపెట్టి చూపించాడు. అక్కడ 'యాక్సిడెంట్ బ్లాక్', 'మర్డర్స్ బ్లాక్', సూసైడ్ బ్లాక్, సెక్సువల్ హరాస్‌మెంట్ బ్లాక్, వార్ బ్లాక్, టెర్రరిస్ట్ బ్లాక్... అని పలు రకాల బ్లాక్‌లున్నాయి. అవన్నీ కూడా ఖాళీగానే వున్నాయి. ఏంటి ఈ బ్లాక్‌లన్నీ అని అడిగాడు. భూలోకం నుండి వచ్చే మృతులతో ప్రతిరోజూ ఈ బ్లాక్‌లన్నీ నిండిపోయి వుండేవి, ఇప్పుడు కరోనా వైరస్‌తో లాక్‌డౌన్ విధించడం మూలంగా ప్రపంచంలో ఈ రకమైన మరణాలు తగ్గిపోయి మాకు పని లేకుండాపోయిందన్నాడు. దానికి నారదుడు... ఒకవేళ ఈ మృతులు తగ్గి వుండొచ్చు... కాని కరోనా మృతులు వున్నారుగా, వాళ్ళ పని భారమైనా వుండాలి కదా అని అడిగాడు. అందుకు యమధర్మరాజు... అన్ని దేశాలలో కరోనా మరణాలు వుండడంతో ఎక్కడికక్కడ బ్రాంచ్‌లు ఏర్పాటు చేశాం, అక్కడే ప్రతినిధులను నియమించి, పాపపుణ్యాలు విచారిస్తున్నాం, కాబట్టి నాకు రిస్క్ తగ్గిందని చెప్పాడు. ఓహో వర్క్ డివైడ్ అన్నమాట... మంచి పాలసీ... ఇక సెలవు తీసుకుంటాను, తిరుమల నుండి శ్రీవారు మాయమైనట్లు ఇప్పుడే సమాచారం వచ్చింది, ఆయన ఎక్కడ వున్నాడో వెదికిపట్టుకోవాలంటూ నారదుడు అక్కడ నుండి బయలుదేరాడు.*

★★★★★

*అది ఐఆర్ 20-420 మున్సిపల్ కార్పొరేషన్ ముదురుదోమలకు ప్రసిద్ధిగాంచిన నెల్లూరు నగరం. ఆ నగరంలో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి. మంత్రి పి. అనిల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కలెక్టర్ ఎం.వి. శేషగిరిబాబు, ఎస్పీ భాస్కర్ భూషణ్, ఇతర అధికార యంత్రాంగమంతా అక్కడ వుంది. అందరూ కరోనా విపత్కర పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారు. ఆ ఆసుపత్రి ప్రాంగణంలోనే వేంకటేశ్వరస్వామి, పద్మావతి, అలివేలు మంగమ్మలు మారువేషాలలో వున్నారు. కరోనా రోగులకు అక్కడ యంత్రాంగం ఎలాంటి సేవలు అందిస్తున్నారో పర్యవేక్షిస్తున్నారు. అంతలో అక్కడ 'నారాయణ నారాయణ' అనే శబ్దం వినిపించి.. శ్రీవారు అటు వైపు చూశాడు. అక్కడ నారదుమహర్షి వున్నాడు. నారదా, మమ్మల్ని ఎలా పసిగట్టావు అని శ్రీవారు ప్రశ్నించాడు. దానికి నారదుడు... స్వామీ, 'వేటగాడు' సినిమాలో మారు వేషంలో వున్న ఎన్టీఆర్‌ను విలన్ సత్యనారాయణ గుర్తు పట్టలేదు గాని, చూసే ప్రేక్షకులు అట్టే గుర్తుపట్టేస్తారు... నేను కూడా అంతే అని చెప్పి.. ఇంతకీ ఇక్కడేం చేస్తున్నారని అడిగాడు. కరోనా పేషంట్లకు వీళ్లంతా చిత్తశుద్ధితో సేవలు అందిస్తున్నారో లేదో పరీక్షిస్తున్నాను అని శ్రీవారు అన్నాడు. అప్పుడు నారదుడు... స్వామీ... వీళ్ళ చిత్తశుద్ధిని ఇంకా లోతుగా పరీక్షించాలంటే ఇంకో ఐడియా వుంది అంటూ చెవిలో ఏదో చెప్పాడు. శ్రీవారు అలాగే చేస్తానంటూ... పెద్దగా దగ్గుతూ... టకటక మని వరుసగా నాలుగు తుమ్ములు తుమ్మాడు. అంతే అక్కడే వున్న మంత్రి అనిల్, ఇతర వైద్య సిబ్బంది మారు రూపంలో వున్న స్వామివారి కాళ్ళు, చేతులు పట్టుకుని ఐసోలేషన్ వార్డులో మంచం మీద పడుకోబెట్టారు. అంతే కాకుండా ఆయన వెంటే వున్నందుకు పద్మావతి, అలివేలు మంగమ్మ అమ్మవార్లను క్వారంటైన్ వార్డుకు తరలించారు. ఐసోలేషన్‌లో నుండి 14రోజులు ఎక్కడకూ కదలకూడదని, రిపోర్టులు నెగటివ్ వచ్చిన తర్వాతే పంపిస్తామని శ్రీవారికి వైద్యులు తేల్చి చెప్పారు. దీంతో శ్రీవారు జుట్టు పీక్కుంటూ నామానాన నేను ఆ తిరుమలలో వుండకుండా ఇలా రావడమేంటి, ఆ అగ్గిపుల్లస్వామి మాటలు విని ఇలా ఆసుపత్రిలో ఇరుక్కోవడమేంటి... ఓ కరోనా నన్నూ వదలవా అంటూ మనసులో బాధపడసాగాడు.!*

# భారత బాట పడుతున్న ప్రపంచం

- భారతీయ సంస్కృతికి, సంప్రదాయాలకు ప్రాధాన్యతనిస్తున్న ప్రపంచ దేశాలు
- ఆరోగ్యమే మహాభాగ్యం.. నాటి పెద్దలమాట - నేడు అందరికీ జీవనబాట











మన భారతీయ సంస్కతి సంప్రదాయాలు ఎంత గొప్పవో ప్రపంచవ్యాప్తంగా నిరూపితమవుతున్న వేళ ఇది. కరోనా మహమ్మారి ప్రపంచాన్ని భయకంపితం చేస్తున్న నేపథ్యంలో ప్రపంచమంతా దానిదెబ్బకు వణికిపోతున్న నేటి పరిస్థితుల్లో భారతీయ సంస్కృతి సంప్రదాయాలకు ఉన్న ప్రాముఖ్యత ఎలాంటిదో ప్రపంచానికి నేడు తేటతెల్లమవుతోంది. 'సర్వే జనా: సుఖినోభవన్తు!'.. అంటూ విశ్వశాంతిని కోరుకుంటూ.. సకల మానవాళి శ్రేయస్సును ఆకాంక్షించే పవిత్రమైన దేశం మనది.

అందరి ఆరోగ్యాన్ని అభిలషిస్తూ 'ఆరోగ్యం మహాభాగ్యం' అని ఎంతోకాలం నుంచి మన పెద్దలు, పూర్వీకులు చెప్తూనే ఉన్నారు. ఆరోగ్యంగా ఉండడానికి ఏమి చేయాలో ప్రాచీన కాలం నుంచి మనకు వివరిస్తూనే ఉన్నారు. ఎలాంటి ఆహార పదార్థాలు తినవచ్చో, ఎలాంటివి తిన కూడదో ఎంతో అనుభవంతో వివరించి ఉన్నారు. తినకూడనవి తింటే ప్రాణాంతకమైన జబ్బులతో బాధపడాల్సి వస్తుందని హెచ్చరించి ఉన్నారు. ఆరోగ్యానికి సంబంధించిన ఎన్నో అపురూపమైన గ్రంథాలు, పుస్తకాలు నేటికీ మనకు అందుబాటులోనే ఉన్నాయి. అలా కాక, చేతులు కలుపుకుని షేక్‌హ్యాండ్ అంటూ సంబరపడితే వచ్చే అనర్థాలు ఎలాంటివో కరోనా వైరస్ వంటి ద్వారా ఇప్పుడు ప్రపంచానికి తెలుస్తోంది. కానీ భారతీయ సంప్రదాయంలో రెండు చేతులెత్తి ఎంతో గౌరవంగా నమస్కారం చేయడం ఒక సంస్కారంగా ప్రాచీనకాలం నుంచి ఉంది. ఆ నమస్కారాన్నే ఇప్పుడు ప్రపంచమంతా ఆచరించక తప్పని పరిస్థితి ఏర్పడింది. అంతేకాదు, సకల మానవుల ఆరోగ్యానికి ఎలాంటి ఆహారం తీసుకోవాలో, ఏవైనా అనారోగ్య సమస్యలు వస్తే వాటికి ఎలాంటి నివారణ చర్యలు ఉన్నాయో మన మహర్షులు రూపొందించిన ఆయుర్వేదం ద్వారా ప్రతిఒక్కరికీ నేటికీ అందుబాటులో ఉంది. మంచి ఆహారపు అలవాట్లు మనకెన్నో ఉన్నాయి. అయితే రానురాను వాటిని విస్మరించి చిత్తం వచ్చిన రీతిలో వ్యవహరిస్తూ, బఫే డిన్నర్లని, జంక్ ఫుడ్‌లని రకరకాలుగా తింటూ, తిన్న ప్లేట్లని అక్కడే ఇష్టం వచ్చినట్లు పడేస్తూ, శుభ్రతకు తిలోదకాలిస్తూ ఉండడం వల్ల అనేకరకాలైన జబ్బులు మనల్ని ఆవరిస్తున్నాయి. అందుకే మన పెద్దలు పూర్వకాలంలోనే మానవాళి ఎలాంటి ఆహారం తింటే ఆరోగ్యం బావుంటుందో సూచించారు. రోజువారీ దైనందిన జీవితంలో ఎంతో ఆరోగ్యప్రదమైన యోగ, సూర్య నమస్కారాలు వంటివి మనకెంతో ఆరోగ్యాన్నిస్తాయి. కానీ ఆచరించేవారు ఎందరు?.. నాగరికత పేరుతో పాశ్చాత్య సంస్కృతి మోజులో పడి మనం అనేక విషయాలను విస్మరిస్తున్నాం. మనకేమీ కాదులే..అనే నిర్లక్ష్య ధోరణితో ఆరోగ్యాన్ని, పరిశుభ్రతను పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నాం. కరోనా వంటి మహమ్మారులు ప్రపంచాన్ని వణికిస్తున్న తీరును గమనించి, అదొక గుణపాఠంగా తీసుకుని మన జీవనవిధానంలో ఇకనైనా మార్పులు రావాలి. ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించుకునేందుకు ప్రతి ఒక్కరూ కంకణ బద్ధులు కావాలి. ప్రకృతిని, పర్యావరణాన్ని నిరంతరం కాపాడుకుంటూ అందరూ ఆరోగ్యంతో కళకళలాడాలి. అందుకోసం, ఇకనైనా మన పూర్వీకులు మన శ్రేయస్సు కోసం చెప్పిన అనేకమైన మంచి విషయాలను మన సంప్రదాయాలు, ఆచారాలను పాటించాలి. దేశం పట్ల, తల్లిదండ్రుల పట్ల, గురువుల పట్ల భక్తిశ్రద్ధలు, సమాజం పట్ల బాధ్యత ఏనాడూ ఎవరూ విస్మరించకూడదు.

### బ్రెజిల్ అధ్యక్షుని నోట.. రామాయణం ప్రస్తావన

ఎంతో విశిష్టమైన మన పురాణాలు, ఉపనిషత్తులు, ఇతిహాసాలు, ప్రాచీన గ్రంథాల్లోని ఎన్నో విషయాలు మానవ జీవితానికి ఎంతగా ఉపయోగపడతాయో ఇప్పుడిప్పుడే ప్రపంచానికి తెలుస్తోంది. తాజాగా ఈనెల 8న భారతదేశానికి బ్రెజిల్ దేశాధ్యక్షుడు రాసిన లేఖలో మనమెంతో

(మిగతా 11వ పేజీలో)

# కరోనాపై సమరంలో సైనికుడులా సతీష్‌రెడ్డి

- అటు దేశ భద్రత.. ఇటు దేశ ప్రజల ఆరోగ్యం పట్ల అప్రమత్తత
- కరోనా వైరస్ పోరులో కీలకపాత్ర పోషిస్తున్న డిఆర్‌డిఓ
- దేశీయ వైద్యరంగానికి అత్యవసర సేవలు అందించేందుకు తగిన వ్యూహాలతో ముందుకు వెళుతున్న సంస్థ ఛైర్మెన్, నెల్లూరీయు గుండ్రా సతీష్‌రెడ్డి



భారతదేశంలోని 130కోట్ల మంది ప్రజలు సైనికులుగా మారి కరోనా మహమ్మారితో పెద్దయుద్ధమే చేస్తున్నారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ ఈ యుద్ధభూమిలో సైన్యాధ్యక్షుడై దేశాన్ని ముందుకు నిడిపిస్తున్నారు. ఆయన వ్యూహాలను అమలు చేయడంలో దేశంలోని ఎన్నో సంస్థలు, ఎంతో మంది ప్రముఖులు, ఇంకెంతో మంది దేశ భక్తులు పాలు పంచుకుంటున్నారు. దేశ ప్రధాని సాగిస్తున్న ఈ సమరంలో ఆయనకు చేదోడువాదోడుగా నిలుస్తున్న వ్యక్తే భారత రక్షణ పరిశోధనా సంస్థ ఛైర్మెన్ గుండ్రా సతీష్‌రెడ్డి. మన నెల్లూరీయుడు కూడా!

ఇంతకాలం దేశ భద్రత, దేశ సరిహద్దుల పరిరక్షణ మాత్రమే వారికి తెలుసనుకున్నాం. శక్తివంతమైన క్షిపణులను రూపొందించి శత్రుదేశాల గుండెలను చీల్చడమే వారి కర్తవ్యం అనుకున్నాం. కాని ఇప్పుడు దేశ సరిహద్దులనే కాదు, అవసరమైతే దేశ ప్రజల ప్రాణాలను కూడా కాపాడడానికి మావంతు కర్తవ్యం నిర్వహిస్తామంటూ ముందుకు వచ్చాడు. ప్రస్తుతం కరోనా వైరస్ మహమ్మారి జడలు విప్పుకుని దేశంలో కరాళ నృత్యం చేస్తున్న వేళ దేశ వ్యాప్తంగా ఆసుపత్రులకు, వైద్యులకు అవసరమైన వైద్య పరికరాలను సమకూర్చే బాధ్యతను డిఆర్‌డిఓ తన భుజాల మీద వేసుకుంది. తమ సంస్థలు అభివృద్ధిచేసిన సాంకేతిక పరిజ్ఞానం ద్వారా పిపిఇ(పర్సనల్ ప్రొటక్షన్ ఎక్విప్‌మెంట్) వెంటిలేటర్లను పెద్దఎత్తున దేశానికి అందివ్వడానికి నిర్విరామ కృషి చేస్తున్నారు. అలాగే మాస్కులు, ఇతర వైద్య పరికరాలను కూడా డిఆర్‌డిఓ తయారు చేస్తోంది. కరోనా వైరస్‌తో దేశం ప్రతిక్షణం యుద్ధం చేస్తున్న వేళ, సతీష్‌రెడ్డి కూడా కంటి మీద కునుకు లేకుండా ఈ వైద్య ఉపకరణాలను అందించడానికి నిర్విరామ కృషి చేస్తున్నాడు. దేశ భక్తితో దేశ రక్షణ కోసం ఒక నెల్లూరీయుడుగా ఆయన చేస్తున్న కృషికి నెల్లూరీయులందరి తరఫున అభినందనలు.



నెల్లూరుజిల్లాలో కరోనా నియంత్రణ చర్యల కోసం తమవంతు సహాయంగా ఇటీవల డిఆర్‌ఓ మల్లిఖార్జునరావును కలిసి 4.10లక్షల విరాళం చెక్కున అందజేస్తున్న ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ పెట్రోల్ పంపు డీలర్స్ అసోసియేషన్ సభ్యులు



ఈ నెల 9వ తేదీ గూడూరులోని రెడ్‌జోన్ ఏరియాలో బడుగుబలహీన వర్గాల ప్రజలకు కనుమూరు హరిచంద్రారెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా బియ్యం, కూరగాయలు, నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్న ఆ ట్రస్టు ప్రతినిధి అనీల్‌కుమార్, సి.ఐ దశరథరామారావు, ఎస్.ఐ బ్రహ్మానాయుడు

# లాక్‌డౌన్‌కు ప్రజలు సహకరించాలి

**- ఎమ్మెల్యే కిలివేటి**



కరోనా వైరస్ వ్యాప్తి చెందుతున్న సమయంలో ప్రజలు స్వచ్ఛంధంగా లాక్‌డౌన్‌ను పాటించి సహకరించాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య విజ్ఞప్తి చేశాడు. ఈ నెల 4న విలేకరులతో ఆయన మాట్లాడుతూ అధికారులు చెప్పే జాగ్రత్తలను విధిగా పాటించాలని, ప్రజలు భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదన్నాడు. కరోనా నివారణకు ప్రభుత్వం అన్ని విధాలా చర్యలు తీసుకుంటోందని తెలిపాడు. నియోజకవర్గ పరిధిలోని నాయుడుపేట, సూళ్లూరుపేట పట్టణాలతో పాటు పాజిటివ్‌గా నిర్ధారించిన పలు ప్రాంతాలను రెడ్‌జోన్‌లుగా గుర్తించి అక్కడ కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్లు తెలిపాడు. అనంతరం మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే సారథ్యంలో నాయకులు కూరగాయలు పంపిణీ చేశారు.

## కరోనా నియంత్రణకు
# కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి
### - రాష్ట్ర మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్

కరోనా పాజిటివ్ కేసులు పెరుగుతున్న దృష్ట్యా ప్రత్యేకమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర జలవనరులశాఖా మంత్రి పి.అనిల్ కుమార్ యాదవ్ సూచించారు. ఈనెల 8న నెల్లూరులోని ఇస్కాన్ సిటీలో గల క్యాంపు కార్యాలయంలో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ల తో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడుతూ మునిసిపాలిటీలు, కార్పొరేషన్ పరిధిలో బ్లీచింగ్, స్ప్రేయర్లను ఎక్కువగా వినియోగించాలని సూచించారు. నాయుడుపేటలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. శానిటేషన్ సిబ్బందికి విధిగా శానిటైజర్లు, మాస్కులు, బ్లీచింగ్ అవసరమైతే అందించేందుకు సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. మునిసిపల్ ఉద్యోగులకు పూర్తి జీతాలు ఇవ్వాలని కమిషనర్లు మంత్రి దృష్టికి తీసుకురాగా, ఆయన వెంటనే పురపాలకశాఖామంత్రి బొత్స సత్యనారాయణతో చర్చించారు. వైస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ కార్యాలయ ఇన్‌చార్జి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు రూప్‌కుమార్ యాదవ్ పాల్గొన్నారు.



## సిపిఎం ఆధ్వర్యంలో..
# అంబలి కేంద్రాలు ఏర్పాటు

కరోనా నేపథ్యంలో పేదప్రజల ఆకలి తీర్చేందుకు నెల్లూరు నగరంలోని సుందరయ్య కాలనీ, జాషువానగర్‌లలో సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 6న అంబలి కేంద్రాలను ఏర్పాటుచేశారు. భవన నిర్మాణ కార్మికులు, ఆటోకార్మికులు పనులు లేక పస్తులు ఉంటున్నారని, ఈ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని ఈ సందర్భంగా సిపిఎం నాయకుడు మాదాల వెంకటేశ్వర్లు కోరారు. అనంతరం పేదలకు అంబలితో పాటు కూరగాయలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కొండా ప్రసాద్, అల్లాడి గోపాల్, వీర్ల శ్రీనివాసులు, కిన్నెర ప్రసాద్, నరసయ్య పాల్గొన్నారు.

# ఫ్రెండ్స్ వాకర్స్ ఆహార పొట్లాలు



ఈ నెల 9వ తేదీ నెల్లూరులోని ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ నిర్వహణలో ఐదు మంది సభ్యుల సహకారంతో పొదలకూరురోడ్డులోని పద్మావతి సెంటర్ యూనియన్ బ్యాంక్ ఎదురుగా ఉండే నిరుపేదలకు, కర్షకులకు, వాహనదారులు 150 భోజన ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గౌరవాధ్యక్షులు నలుబోలు బలరామయ్యనాయుడు కరోనా వైరస్ జాగ్రత్తలు సూచిస్తూ... రెడ్‌జోన్‌గా ప్రకటించిన వార్డులలో ప్రభుత్వ అధికారులు చెప్పిన సూచనలు పాటిస్తూ కరోనాను తరిమికొడదామని పిలుపునిచ్చారు. సభ్యులు షేక్ నజీర్‌అహ్మద్ మజ్జిగ, నీరు బహుకరించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ బొగ్గవరపు శ్రీమన్నారాయణ, ట్రెజరర్ లక్ష్మీనారాయణ, సభ్యులు కొండూరు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# భయం.. భయం!
(మొదటి పేజీ తరువాయి)

నాయుడుపేట పెద్ద ప్రమాదంలో వున్నట్లు. ఇక ఇందుకూరుపేట 2, వాకాడు 4, అల్లూరు 2, బోగోలు 1, కావలి 1, కోవూరు 1, బుచ్చిరెడ్డిపాలెం 1, గూడూరు 2, ఓజిలి 1, వెంకటగిరి 1, తడ 3, టి.పి గూడూరు 2 కేసులున్నాయి.

జిల్లాలో 46 మండలాలకుగాను 14 మండలాలలో పాజిటివ్ కేసులు నమోదైవున్నాయి. ముఖ్యంగా నెల్లూరులో ముప్పాతిక నగరం రెడ్‌జోన్ పరిధిలోకి వచ్చేసింది. ఎక్కడికక్కడ లాక్‌డౌన్ ఆంక్షలను కఠినతరం చేశారు. నాయుడుపేటలోనూ ఆంక్షలు కఠినంగా అమలు చేస్తున్నారు. కరోనా పాజిటివ్ వచ్చిన బాధితులను కోవిడ్-19 ఆసుపత్రిలో నిరంతరాయంగా వైద్యసేవలు అందిస్తున్నారు. ఇంతవరకు మర్కజ్ నుండి వచ్చిన వారికి, వారి కుటుంబసభ్యులకు వైద్య పరీక్షలు పూర్తయ్యాయి. ఈ పరీక్షల్లోనే పాజిటివ్‌లు ఎక్కువగా వచ్చాయి. వీరితో సన్నిహితంగా మెలిగిన వందలమందిని క్వారంటైన్‌లో వుంచి పరీక్షలు నిర్వహిస్తున్నారు. అయితే క్వారంటైన్‌లో వున్న వారికి నిర్వహిస్తున్న వైద్యపరీక్షలలో ఎక్కువమందికి నెగటివ్ రిపోర్టులు వస్తుండడం కొంత ఆనందించాల్సిన విషయం.

## నెల్లూరు నగరంలో 26 రెడ్‌జోన్లు

కరోనా మహమ్మారి నేపథ్యంలో నెల్లూరు నగరంలోని 26 డివిజన్లను అధికారులు రెడ్‌జోన్లుగా ప్రకటించారు. ఆయా ప్రాంతాల్లో ఈ వ్యాధి వ్యాప్తిని నియంత్రించేందుకు పెద్దఎత్తున చర్యలు తీసుకుంటున్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ప్రజలు తప్పనిసరిగా అధికారులు సూచిస్తున్న నియమ నిబంధనలను పాటించాలని, ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినచర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరిస్తున్నారు. రెడ్‌జోన్లు ఉన్న ప్రాంతాల్లో ఎవరూ ఇళ్ళ నుంచి బయటకు రాకూడదని, ఇరుగుపొరుగు ఇళ్ళకు కూడా వెళ్ళకూడదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. నెల్లూరు నగరంలో పాజిటివ్ కేసులు నమోదైన ప్రాంతాలు 3-4-5-6-7-18-20-21-22-23-30-32-33-34-35-36-38-39-40-41-42-43-47-48-53-54 డివిజన్లలో రెడ్‌జోన్ నిబంధనలు అమలులో ఉన్నాయని, నిబంధనలను ఎవరూ ఎట్టిపరిస్థితుల్లోనూ అతిక్రమించకూడదని, ప్రజలకు అవసరమైన కూరగాయలు, మందులు, నిత్యావసర వస్తువులు, డోర్ డెలివరీ సౌకర్యం ద్వారా అందజేస్తామని అధికారులు చెప్తున్నారు.

# భారత బాట
(మొదటి పేజీ తరువాయి)

పవిత్రంగా ఆరాధించే రామాయణం ప్రస్తావన కూడా ఉండడం ఎంతో విశేషం. కరోనా మహమ్మారి విలయతాండవం చేస్తున్న ఆ దేశంలో ఆ దేశం అధ్యక్షుడు జెయిర్ బొల్సనారో మన ప్రధాని నరేంద్రమోడీకి ఒక లేఖ రాశారు. "రాముడి సోదరుడు లక్ష్మణుడిని రక్షించడం కోసం హిమాలయాల నుంచి హనుమంతుడు సంజీవని తెచ్చాడు' అంటూ రామాయణంలోని మాటలను గుర్తుకు తెచ్చాడాయన. కరోనా మహమ్మారి వ్యాధి నివారణకు అవసరమైన హైడ్రాక్సీ క్లోరోక్విన్ మందులను పంపాలని కోరుతూ భారత్‌కు ఆయన రాసిన లేఖ అది. ఇలా దేశదేశాల్లో ప్రపంచవ్యాప్తంగా మన పురాణాలు, ఇతిహాసాలు ఎందరికో మార్గదర్శకంగా ఉండడం భారతీయులందరికీ గర్వకారణం.

## ఆరోగ్య దీపం వెలిగించిన.. ప్రధాని మోడీ

*'శుభం కరోతి కల్యాణమారోగ్యం ధన సంపదా*
*శత్రుబుద్ధి వినాశాయ దీపజ్యోతి నమోస్తుతే'...*

అంటూ భారత ప్రధాని మోడీ ఈనెల 5న దేశప్రజలందరికీ శుభం, శ్రేయస్సు, ఆరోగ్య సంపదలను ప్రసాదించే దీపాన్ని వెలిగించి ఆ దీపకాంతులకు భక్తితో నమస్కరించారు. ప్రజలకు అనారోగ్య బాధలు పోయి ఆరోగ్యంతో కళకళలాడాలని ఆకాంక్షిస్తూ ప్రధాని దీపజ్యోతులకు నమస్కరించుకున్నారు. ఇంత గొప్ప సంప్రదాయం భారతీయులది కావడం మన అదృష్టం. అందుకే, దేశప్రజలంతా ప్రధాని చెప్పినట్లుగానే ఆచరించి భారతీయ సంప్రదాయాన్ని గౌరవించారు. దీపకాంతులు మనల్ని నానా రకాల భవరోగాల నుంచి, భయాల నుంచి, అజ్ఞానం నుంచి వెలుగుల బాటలోకి నడిపిస్తాయని మన పూర్వీకులైన మహర్షులు ఏనాడో స్పష్టం చేశారు. నేటి ఆధునిక మానవుల జీవితాలకు కూడా ఎంతగానో ఉపయోగపడే ఇలాంటి వాక్కులు మనకే కాదు.. ప్రపంచానికే ఆదర్శం..సకల మానవాళికే మార్గదర్శకం...'సర్వే జనా: సుఖినోభవన్తు!'.....

# చేతలు ఘనం!
(మొదటి పేజీ తరువాయి)

అధికారుల టైం వేస్ట్ చేయనవసరంలేదు, వాళ్ళ పని వాళ్ళను చేయనిస్తే సమస్యలు వాటంతట అవే పరిష్కారమవుతాయనే కోణంలో చూస్తే 40 ఏళ్ల సీనియర్ చంద్రబాబు కంటే జగన్ ఎంతో బెటర్.

ప్రస్తుతం కరోనా వైరస్ ప్రపంచాన్నంతా పట్టి పీడిస్తోంది. మండలం నుండి దేశం దాకా వ్యవస్థల వారీగా ఎవరి పరిధిలో వాళ్ళు పని చేస్తున్నారు. ప్రస్తుతం వున్న వాతావరణంలో చంద్రబాబే సీఎంగా వుంటే అధికారులు 'వైరస్‌పై పోరు'లో కంటే కూడా చంద్రబాబు కాన్ఫరెన్స్‌లకే ఎక్కువ సమయం కేటాయించాల్సి వచ్చేది.

ఒక సీఎం ఎన్నిసార్లు ప్రెస్‌మీట్లు పెట్టాడు, ఎన్ని గంటలు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించాడన్నది ముఖ్యం కాదు, వచ్చిన సమస్యపై ఎంత సమర్థవంతంగా పోరాటం చేస్తున్నాడన్నదే ముఖ్యం.

రాష్ట్రంలో కరోనా వైరస్‌పై జరుగుతున్న పోరు తీవ్రంగానే వుంది. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి పర్యవేక్షణలో రాష్ట్ర అధికార యంత్రాంగమంతా కూడా కట్టుదిట్టంగా పని చేస్తోంది. జగన్ ప్రవేశ పెట్టిన వాలంటరీ వ్యవస్థ ఈ సమయంలో అత్యంత కీలకంగా పనిచేస్తోంది. అసలు మర్కజ్ ఘటనే లేకపోయి వుంటే అతికొద్ది కేసులతో రాష్ట్రం ఎంతో ప్రశాంతంగా వుండేది. మర్కజ్ ఘటన వల్లే రాష్ట్రంలో కేసులు ఇబ్బడిముబ్బడిగా పెరిగాయి. అయినా కూడా మర్కజ్‌కు వెళ్లొచ్చిన వారిని వెదికి పట్టుకుని వైద్య పరీక్షలకు పంపించడంలో రాష్ట్ర అధికార యంత్రాంగం ఎంతో సమర్థవంతంగా పని చేసింది. ఇంకా కొన్ని రాష్ట్రాలు మర్కజ్‌కు వెళ్లొచ్చిన వారిని పూర్తి స్థాయిలో పట్టుకోలేక నానా తంటాలు పడుతున్నాయి. కరోనాపై పోరు విషయంలో సీఎంగా జగన్ ఎక్కడా వెనక్కి తగ్గలేదు. ఏ ముఖ్యమంత్రికీ తీసిపోలేదు. అనుభవం లేకపోయినా సమస్యను ఎదుర్కోవడంలో ఎంతో పరిణితి చూపుతున్నాడు.

అతను కేసీఆర్‌లా మాటకారి కాకపోవచ్చు, చంద్రబాబులా ప్రతిదీ ఫోకస్ చేసుకోవాలనే పిచ్చి లేకపోవచ్చు... అంత మాత్రాన వెనుకపడినట్లు కాదు, పనితీరు ఎలా వుందనేదానికి పబ్లిసిటీ కాదు... ఫలితాలు ముఖ్యం! కరోనా వైరస్ ప్రభావం మొదలైనప్పటి నుండి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తంగానే ఉంది. రాష్ట్రంలోని 13 జిల్లాల అధికార యంత్రాంగంతో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి నిరంతరం సమీక్షిస్తూనే ఉన్నారు. ముఖ్యంగా అనుమానితులను, విదేశాల నుండి వచ్చినవారిని వెనువెంటనే క్వారంటైన్‌కు పంపడం ద్వారా కేసులను చాలావరకు తగ్గించారని చెప్పవచ్చు.

# పొడిగింపుతోనే ముగింపు!
(మొదటి పేజీ తరువాయి)

వంటి దేశాలే ఈ వైరస్ ధాటికి అల్లాడుతుండగా భారత్ మాత్రం సమర్థవంతంగానే ఎదుర్కొంటోంది. కేసులు భారీ ఎత్తున పెరగకుండా జాగ్రత్త పడుతోంది.

దేశంలో కరోనా వైరస్ విస్తరించకుండా అమలు చేస్తున్న లాక్‌డౌన్ గడువు ఈ నెల 14వ తేదీతో ముగియబోతోంది. మార్చి 24వ తేదీ నుండి 3 వారాల పాటు లాక్‌డౌన్ అమలులోకి రావడం తెలిసిందే! సరైన సమయంలో ప్రధాని లాక్‌డౌన్ నిర్ణయం తీసుకోవడం సత్ఫలితాలనే ఇచ్చిందని చెప్పుకోవచ్చు. ఆయనే గనుక అప్పుడు లాక్‌డౌన్ నిర్ణయం తీసుకోకపోయి వుంటే, ఈ పాటికి దేశం నిండా కరోనా పాజిటివ్ కేసులు గుట్టలుగుట్టలుగా వస్తుండేవి.

## మర్కజ్ లేకుంటే తీవ్రత తక్కువే

అసలు దేశంలో నిజాముద్దీన్ మర్కజ్ సంఘటనే లేకుంటే కరోనా వైరస్‌పై పోరులో ఇంకా అద్భుత ఫలితాలను సాధించగలిగి వుండేవాళ్ళం. దేశంలో కరోనా కేసులు తీవ్రం కావడానికి, శరవేగంగా వైరస్ వ్యాప్తి చెందడానికి మర్కజ్ సంఘటన ప్రధాన వేదికగా మారింది.

## పొడిగింపే శరణ్యం

కరోనా వైరస్‌పై మన పోరు ఇంకా ముగింపు దశకు రాలేదు. మర్కజ్ ఉదంతం లేకపోయి వుంటే 21రోజుల లాక్‌డౌన్‌తోనే మంచి ఫలితాలు వచ్చేవి. లాక్‌డౌన్‌ను వైరస్ తీవ్రంగా వున్న ప్రాంతాలలో మినహాయించి మిగతా చోట్ల ఎత్తేయడానికి అవకాశముండేది. కాని మర్కజ్ మూలంగా దేశంలోని మారుమూల ప్రాంతాలకు సైతం వైరస్ విస్తరించడంతో, దినిమూలాలు ఎక్కడిదాకా వెళ్లాయో, ఎంతమందికి వైరస్ సోకిందో తెలియని పరిస్థితి. కాబట్టి వైరస్ గొలుసు తెగేవరకు లాక్‌డౌన్‌ను పొడిగించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

## అన్ని రాష్ట్రాల మద్దతు

దేశంలోని మెజార్టీ రాష్ట్రాలు కరోనా వైరస్ మూలంగా ఇబ్బంది పడుతున్నాయి. లాక్‌డౌన్‌ను ఎత్తేస్తే, ప్రజల జీవన విధానం తిరిగి యథాతథంగా చోటుచేసుకుంటే మందకొడిగా వున్న వైరస్ ఒక్కసారిగా విజృంభించే అవకాశాలు లేకపోలేదు. కాబట్టి వైరస్ పూర్తిగా అదుపులోకి వచ్చేదాకా లాక్‌డౌన్‌ను పొడిగించడమే ఉత్తమమార్గంగా అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు భావిస్తున్నారు. ఇదే అభిప్రాయాన్ని వారు ప్రధానికి కూడా చెప్పారు.

కేంద్ర ప్రభుత్వం కూడా లాక్‌డౌన్‌ను పొడిగించడానికే మొగ్గు చూపుతోంది. కరోనా వైరస్‌పై విజయం సాధించేవరకు విరామం, విశ్రాంతి లేదని ప్రధాని నరేంద్ర మోడీ ఉద్ఘాటిస్తున్నారు. ఓ పక్క ఆయన ప్రజలలో ధైర్యం నింపుతూ, ఇంకో పక్క అన్ని పక్షాలను సమన్వయం చేసుకుంటూ 'లాక్‌డౌన్' అస్త్రంతో వైరస్ అంతం కోసం పోరును కొనసాగించడానికే సిద్ధమయ్యారు. కాబట్టి ఈ నెలాఖరు వరకు ఇప్పుడున్న యథాస్థితి కొనసాగే అవకాశాలున్నాయి.



## కరోనా మహమ్మారిపై...

# భారత్ విజయం తథ్యం

### - ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు ధీమా

ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనా మహమ్మారిపై భారత్ ఖచ్చితంగా విజయం సాధించి తీరుతుందని భారత ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ధీమా వ్యక్తం చేశారు. కరోనాను ఎదుర్కొనేందుకు వచ్చే వారం రోజులు అత్యంత కీలకమైనవని ఆయన అన్నారు. ఈ వారం రోజుల్లో ఉండే కరోనా తీవ్రతను బట్టి లాక్‌డౌన్‌ను మరికొన్ని రోజులు పొడిగించాలా వద్దా అనే ప్రభుత్వం తీసుకునే నిర్ణయం ఆధారపడి ఉంటుందన్నారు. కరోనాను ఎదుర్కొనేందుకు మన ముందున్న మార్గాలు చాలా పరిమితమైనవని, పరిస్థితి తీవ్రంగా ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో ఏం చేయాలో నిర్ణయించడానికి ఒక స్పష్టమైన దృష్టికోణం ఉండాలని, అది మన దేశ నాయకత్వానికి ఉందని, అసాధారణ పరిస్థితుల్లో అసాధారణ నిర్ణయాలు తీసుకోవడానికి ప్రభుత్వం ఏమాత్రం వెనుకాడబోదని మన దేశ నాయకత్వం చాటుకుంటోందని ఆయన కొనియాడారు.

130 కోట్ల మందికి పైగా జనాభా ఉన్న మన దేశంలో 21 రోజుల పాటు లాక్‌డౌన్ అమలుచేయడం ఎంతో సాహసోపేతమైన నిర్ణయమని, ప్రజానీకం కూడా ఉక్కు సంకల్పంతో ఆ నిర్ణయాలనకు కట్టుబడి ఉండడం ఎంతో సంతోషకరమని ప్రజలను ఆయన అభినందించారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో దేశ ప్రధాని, ముఖ్యమంత్రులు ఒకేమాటపై నిలిచి కలసి కట్టుగా కార్యాచరణకు దిగడం మన సమాఖ్యస్ఫూర్తికి అద్దం పడుతోందని, అందరూ ఏకాభిప్రాయానికి రావడం శుభపరిణామమని, ఇది ప్రజల్లో ఆత్మ విశ్వాసం నింపుతోందని ఆయన అన్నారు. సంక్షోభాలను సమిష్టిగా ఎదుర్కోగలమని నిరూపిస్తూ జాతి అంతా ఒక్కటై కరోనాను ఎదుర్కొనేందుకు సంకల్పించిందని, కరోనాపై భారత్ విజయం తథ్యమని ఉపరాష్ట్రపతి చెప్పారు. కరోనాపై పోరాటంలో మనదేశం కీలకపాత్ర వహిస్తుందని, మన విజయం ప్రపంచానికి స్ఫూర్తినిస్తుందని, కరోనా మహమ్మారిని నియంత్రించేందుకు మనదేశం సకాలంలో సమర్థంగా పోరాటం ప్రారంభించినందుకు సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఆర్థికంగా దేశానికి నష్టం వాటిల్లినప్పటికీ తిరిగి గాడిలో పెట్టవచ్చని, అదే మనుషుల ప్రాణాలు పోతే మాత్రం తిరిగిరావని ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి అన్నారు. బలమైన నాయకత్వం వల్లనే ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో దేశప్రజలంతా సురక్షితంగా బయటపడతారని ఆయన స్పష్టం చేశారు.

**దేశప్రజల పోరాటం అభినందనీయం**

మార్చి 24న ప్రధాని మోడీ దేశంలో మూడు వారాల లాక్‌డౌన్ ప్రకటించిన తర్వాత మొదటి రెండు వారాలు ప్రజలంతా బలమైన సంకల్పంతో కరోనాపై పోరాటం చేయడం అభినందనీయమన్నారు. ప్రస్తుతం మూడవ వారంలోకి చేరుకున్న క్రమంలో ఏప్రిల్ 14 తర్వాత ప్రధాని మోడీ ఏ నిర్ణయం తీసుకున్నా ఇప్పటిమాదిరిగానే దేశప్రజలంతా ప్రభుత్వానికి సహకరించి కరోనాను పూర్తిగా అంతం చేయాలని ఉపరాష్ట్రపతి ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రస్తుతం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నందు వల్ల మనదేశంలో కరోనా వైరస్ వ్యాప్తిని సమర్ధవంతంగా అడ్డుకోగలుగుతున్నామన్నారు. భౌతికదూరం పాటించకపోతే ఎంతటి విపత్తు ఏర్పడుతుందో తబ్లిగీ జమాత్ కార్యక్రమం ద్వారా తేటతెల్లమైందని, ప్రజలంతా ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని జాగ్రత్తలు పాటించాలని ఆయన సూచించారు. ఈ కష్టకాలంలో ప్రజలకు ఆకలి బాధలు లేకుండా పంటలు పండించే రైతులకు మనమంతా రుణపడి ఉండాలన్నారు. ప్రజలంతా కలకాలం హాయిగా జీవించాలంటే ఇంకొన్ని రోజులు ఇబ్బందులను భరించాలని ఆయన అంటూ ఈ ఆపత్కాలంలో ప్రజలను కాపాడడానికి వైద్యులు, పారామెడికల్ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు, పోలీసులు, సమాచార సాధనాలు, పాలకులు శక్తివంచన లేకుండా కృషిచేస్తున్నారని, ప్రజలు కూడా ఈ సమిష్టి కృషిలో మమేకమవుతున్నారని, కరోనాపై అంతిమ విజయం సాధించే వరకు ఇదే విధంగా ఏకాగ్ర దృష్టి, అకుంఠిత దీక్షలను మనం ప్రదర్శించాలని, తద్వారా అత్యంత భయంకరమైన కరోనా వైరస్‌ను చిత్తు చేయాలని ఉప రాష్ట్రపతి పిలుపునిచ్చారు.

**వదంతులను నమ్మవద్దు**

కరోనా నేపథ్యంలో సామాజిక మాధ్యమాల్లో వ్యాప్తి చెందుతున్న తప్పుడు సమాచారానికి అడ్డుకట్ట వేయాలని, ఎవరూ పుకార్లను, వదంతులను నమ్మవద్దని వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. ఈనెల 6న ఫేస్‌బుక్ ద్వారా ప్రజలకు ఆయనొక సందేశాన్నిచ్చారు. మూఢనమ్మకాలకు దూరంగా ఉండాలని, వాటివల్ల కరోనాపై చేస్తున్న పోరాటం బలహీనమయ్యే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. ఒక సంఘటన ఆధారంగా కొంతమంది తప్పుడు సమాచారంతో, వెకిలి చర్యలతో ఒక మత సమూహాన్ని అనుమానిస్తున్నారని, ఇది మంచిపద్ధతి కాదని ఆయన హితవు పలికారు. కరోనాపై పోరులో వైద్యులను గౌరవించడం, వారి భద్రతకు ప్రాధాన్యత ఇవ్వడం ఎంతో కీలకమని, కరోనా కట్టడికి చేపడుతున్న చర్యలన్నీ సజావుగా సాగుతున్నాయని అనుకుంటున్న సమయంలో కొన్ని సంఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయని, భౌతిక దూరం పాటించడంలో బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారని, అందుకు నిజాముద్దీన్ సమావేశమే ఉదాహరణ అని ఆయన పేర్కొన్నారు.

## కరోనా విపత్తులో..

# శ్రీసిటీ 'కెలాగ్స్'వితరణ

### 5 లక్షల విలువైన ఆహార ఉత్పత్తుల సాయం



ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనా మహమ్మారి దేశానికి ఒక విపత్తుగా పరిణమించిన నేపథ్యంలో శ్రీసిటీలోని కెలాగ్స్ పరిశ్రమ ప్రజలకు తనవంతు సాయం చేసేందుకు ముందుకు వచ్చి అందరి ప్రశంసలు అందుకుంటోంది.

ఉదయం వేళల్లో అల్పాహారంగానే కాక, ఇతర సమయాల్లో కూడా పిల్లలు, పెద్దలు ఇష్టంగా తినే కార్నఫ్లాక్స్, తదితర పౌష్టికాహార ఉత్పత్తులను తయారుచేసే కెలాగ్స్ పరిశ్రమ కరోనా విపత్తుతో బాధపడుతున్న ప్రజలకు సుమారు 5 లక్షల రూపాయల విలువ కలిగిన 1.2 టన్నుల కార్నఫ్లాక్స్ ఆహార ఉత్పత్తులను అందజేసింది. ఆ ఉత్పత్తులను ఈనెల 8వ తేదిన సత్యవేడు ఎమ్మెల్యే కె.ఆదిమూలంకు కెలాగ్స్ పరిశ్రమ ప్రతినిధి ప్రకాష్ సిర్సాత్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెలాగ్స్ పరిశ్రమ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ ఉత్పత్తులను మండలంలోని పలు గ్రామాల్లో పేదలకు, విద్యార్థులకు పంపిణీ చేస్తామని ఆయన చెప్పారు. కరోనాపై పోరాటంలో భాగంగా ప్రభుత్వానికి 2 కోట్ల రూపాయల విరాళం ఇవ్వడంతో పాటు, అంబులెన్స్‌ల ఏర్పాటు, ఇతరత్రా వివిధ రకాల సాయం అందించిన శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సేవలను ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొనియాడారు.

కరోనాకు సంబంధించి ప్రస్తుతం ఉన్న కీలకమైన పరిస్థితుల్లో నియోజకవర్గంలోని ప్రజలందరూ ఇళ్ళలోనే ఉంటూ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) రమేష్‌కుమార్, సెక్యూరిటీ ఇన్‌చార్జి రమేష్ తదితరులు పాల్గొన్నారు.


ద్వితీయ వర్ధంతి




మా తృతీయ సోదరి

శ్రీమతి బయ్యపురెడ్డి భారతి గారు

పరమపదించి తేది. 7.4.2020 నాటికి రెండు సంవత్సరాలు అయినవి.
వారి ద్వితీయ వర్ధంతి సందర్భంగా వారి దివ్యస్మృతిని స్మరించుకుంటూ..
వారి పవిత్రాత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ...
శ్రద్ధాంజలి ఘటిస్తున్నాము.

ఇట్లు
మల్లిఖార్జునరెడ్డి కైపు
Portland, USA
మరియు కుటుంబసభ్యులు


Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com